ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

కథా నిలయం శ్రీకాకుళం

మార్చి 1, 2009

39286





అడ్మిషన్లు... అగచాట్లు

హ్యాపీ బర్త్‌డే

(2009 మార్చి -1 నుంచి
2009 మార్చి - 7 వరకు)

జి. తరుణ్(డుంబు)
4సం॥, మార్చి-1
ప్రతిమ-శ్రీనివాస్
ప్రశాంత్‌నగర్-హైదరాబాద్



వైభవ్
2సం॥, మార్చి-2007
అనిత-భూమయ్య
రూద్రూర్-నిజామాబాద్

కె. మధుమిత
8సం॥, మార్చి-3
లక్ష్మి-పర్వతాలు
బిజినేపల్లి-మ॥నగర్

దీపిక
1సం॥, మార్చి-2008
లక్ష్మి-గంగాధర్
రూద్రూర్-నిజామాబాద్

డి. మోహిత్‌చంద్ర
4సం॥, మార్చి-2005
రాధ-రాజాచంద్ర
పేర్నమిట్ట-ప్రకాశం

బి. శివగోపాల్‌నాయక్
10సం॥, మార్చి-4
లక్ష్మీబాయి-హరినాయక్
ముత్యాలపాడు తండా-కర్నూలు



డి. రవిచంద్ర
మార్చి
శకుంతల-వేణు
కత్తవపాడు-ప॥గో॥

ఎస్. లహరి
1సం॥, మార్చి-2008
కృష్ణవేణి-సింహం
ఎల్.బి. నగర్-హైదరాబాద్

ఎన్. సాయి సృజన్
మార్చి-20
ఉషారాణి-లోకేశ్వరరావు
ఉక్కునగరం-విశాఖపట్నం

ఎస్. చంద్రహాస్
3సం॥, మార్చి-2006
సాధన-అశోక వర్ధన్‌రావు
అప్పలనర్సింహాపురం-ఖమ్మం

ఆర్. లక్ష్మీప్రసన్న
6సం॥, మార్చి-7
అచ్చియ్యమ్మ-రమణ
మాకవరపాలెం-విశాఖ

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి
ప్లాట్ నెం. 21/1, ఎం.ఎహెచ్ భవన్, ఆర్టీసీ కళా నిలయం దగ్గర,
హైదరాబాద్-500 020

మనలో మాట

స్లమ్ స్వగతం

నేనూ... మురికివాడను. నాగరికతకూ, పేదరికానికీ పుట్టిన అనాథబిడ్డను. నగరం చంకల ఇరుకున నలుగుతున్న అనాకారిని. నగర గమనంలో ఇరుస్నులా ఉన్నా ఇరుకిరుగ్గా బతుకుతున్నదాన్ని.

ఇప్పుడు అందరూ నా గురించి చర్చిస్తున్నందుకు ఆనందంగా ఉంది. అంతర్జాతీయ వేదికపై ఆస్కార్ అందుకున్నందుకు మరీ ఆనందంగా ఉంది. నేనూ పరవశిస్తున్నాను, అందరిలాగే. జయజయహో అని పరవళ్లు తొక్కుతున్నాను. నా వీధిబాలల ఉన్నతిని చూసి, ఉత్సాహపడుతున్నాను. నన్ను చూసి నేనే అబ్బురపడుతున్నాను. అందరూ పొగుడుతుంటే- సంతోషంతో సిగ్గేస్తోంది కూడా!

మురికివాడకు ఇంత 'ఆస్కారం' ఉందా? ఇలాంటి అవకాశం ఉందా? అని చాలామంది ఆశ్చర్యపోతున్నారు. దేశవిదేశాల్లో నా గురించి ఆలోచించేవాళ్ల సంఖ్య పెరుగుతోంది. ఇప్పుడు నేనొక హైలీ డిమాండెడ్ కథావస్తువుని. ఆకర్షణీయమైన మార్కెట్ సరుకుని. నాపై కథలూ కవిత్వాలూ గతంలో చాలా వచ్చాయి. ఇక విశ్వతెరపై సరికొత్తగా వస్తాయి. ఇప్పుడు భారతీయ మురికివాడ అవార్డుల అడుగుజాడ. ఇక విదేశీ, స్వదేశీ కెమెరాలన్నీ నా అందచందాలను బంధించే పనిలో బహు బిజీ అవుతాయి. నా ఆకలీ దారిద్ర్యం, మురికీ ఇరుకూ.... సినిమాలకు ముడి సరుకు అవుతుంది. నా అభాగ్యం, అనాగరికం విశ్వవేదికలపై వినోదమో, ఇంకే రసాస్వాదమో అయి తీరతాయి. ఏ ఇంగ్లీషువాడో హాలీవుడ్ స్థాయిలో కథను వండి వార్చితే... ఎన్ని అవార్డులో... ఇంకెన్ని అభినందనలో...! తలచుకుంటేనే ఆనందమేస్తోంది! తనువు పులకరించిపోతోంది!!

ఈ ఆనందంలో జయహో జయజయహో అని పాడాలని ఉంది.
కీర్తించి, నర్తించి, తరించి పోవాలని ఉంది.
చూడరా, నా దేశ ఔన్నత్యం అని దిక్కులు పిక్కటిల్లేలా అరవాలని ఉంది.
తప్పకుండా అలాగే చేస్తా... ఒక్క క్షణం...
కొంచెం మంచినీళ్లివ్వండి..., తాగి చాన్నాళ్లయింది!
ఇంత మందుబిళ్ల ఇవ్వండి. ఒళ్లంతా జ్వరంగా ఉంది!!
ఈ చిరుగుల గుడ్డ స్థానే ఓ కొత్త బట్ట కప్పండి..., నలుగురిలో తిరగాలి కదా!
ఇల్లు ఇరుగ్గా ఉంది. మీరు కొంచెం బయటికెళ్లండి. ఊపిరి పీల్చుకోవాలి!!

★

ఈ సంచికలో....

టపా	...	2
విజ్ఞాన వీచిక	...	3
ఆరోగ్యం	...	5
తెల్సా	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
రుచి	...	17
కవిత్వమ్	...	20
క్రైమ్ కథ	...	21
కథ	...	22
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

మంచి పుస్తకం ...4

ప్రజా రచయితలకు ధృవతార కొడవటిగంటి

బార్బీ బొమ్మ ...6

చూద్దామా ... 8

శిథిల సౌధాలు చెప్పే ఊసులెన్నో...

సినిమా కబుర్లు.. 18

నిర్మలమ్మ స్వగతం



అభినందనీయం

బడ్జెట్ పరంగానూ, విజయావకాశాలపరంగానూ నిర్మాతను నిలబెడుతున్న, దర్శకుడిని ప్రోత్సహిస్తున్న చిన్న చిత్రాల విజయాలను గురించి 15-2-09 నాటి స్నేహలో అట్టమీది కథ ద్వారా తెలియజేసినందుకు ధన్యవాదాలు. యువ తారలను ప్రోత్సహించడంతో పాటు ఆకర్షించే విధంగా ఉండడం వల్ల ఐతే, గోదావరి, హేపీడేస్ వంటి చిత్రాలు అవార్డులు సాధించగలిగాయి. అలాగే అత్యాధునిక సౌకర్యాలు కలిగి అతి తక్కువ ధరలకు లభిస్తూ బ్రాండెడ్ ఫోన్లతో పోటీ పడుతోన్న చైనా మొబైల్‌ఫోన్లతో వచ్చే సమస్యలను గురించీ, పరిష్కారాలను గురించీ మరియు మెదడులో కణుతులు రావడానికి గల అవకాశాల గురించీ ఈవారం చక్కగా తెలుసుకున్నాం. రుచి శీర్షికలోని వంటకాలు నోరూరించాయి.

గొల్లమందల సురేష్‌కుమార్,
సీతారాంపురం, ఖమ్మం.

చక్కని అంశాలు

ఫిబ్రవరి 15వ తేదీ ఆదివారం అనుబంధంలోని అన్ని అంశాలు చాలా ఆసక్తికరంగా ఉన్నాయి. ముఖ్యంగా చలపాక ప్రకాష్ గారి సమిష్టి జీవనం, ఇంకా కుమార్‌గారి రెక్కలు తెగిన గువ్వ, పొద్దుతో పాటు తిరిగే పొద్దుతిరుగుడు పువ్వు అలాగే పొద్దును చూచి ముడుచుకుపోయే కాంపియన్ పూలకు సంబంధించిన సమాచారం అందించి పాఠకులకు చాలా మేలు చేస్తున్నారు. అలాగే పోలీసు కుక్కల గురించి, పిల్లులు, ఎలుకలు మొదలైన జంతువులు భూకంపాలను ఏవిధంగా పసిగడతాయో చాలా చక్కగా వివరించారు. అట్టమీది కథలో చిన్న చిత్రాలను విశదీకరిస్తూ వాటిలో లాభనష్టాలు, తీరు తెన్నులను వివరంగా తెలియజేయటం చాలా బాగుంది. ఇన్ని చక్కని అంశాలతో ఆదివారం మాకు ఆద్యంతం కనువిందు చేసిందనటంలో అతిశయోక్తి లేదు. హేపీబర్త్‌డేలో పిల్లల ఫొటోలు చాలా బాగుంటున్నాయి.

మదీనా, విశాఖపట్నం.

అవగాహన ప్రదాయిని

స్నేహలో చిన్నచిత్రాలదే చిద్విలాసం అన్న తెలకపల్లి రవిగారి రచన చదివాం. చిన్న చిత్రాల హవా కొన్నాళ్ళుగా కొనసాగుతూ పెద్ద చిత్రాల భవితవ్యాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఈ వారం 'తెల్సా!' పేజీ మాకెన్నో కొంగొత్త విశేషాల్ని తెలియజేసి, మాలో ఎంతో ఉత్సాహాన్ని నింపింది. చిన్నపాప కథ సంభ్రమాశ్చర్యానికి గురిచేసింది. విజ్ఞాన వీచిక ద్వారానే చైనా మొబైల్ ఫోన్‌లో ఐఎమ్ఇఐ అంటే ఏంటో తెలిసింది. ఆరోగ్యం శీర్షిక ద్వారా మెదడులో కణుతులు పట్ల అవగాహన కలిగింది. బాలనేస్తాలులో చిత్ర విచిత్రం కాలమ్ అంటే మాకిష్టం. కొత్త పుస్తకాలు, స్వీకారం ద్వారా కొత్త కొత్త పుస్తకాల పరిచయ భాగ్యం కలుగుతోంది. మనలో మాటలో ఉదహరించినట్లు విధ్వంసం వల్ల విషసంస్కృతిని అంతమొందించడం సాధ్యం కాదు. వివేచనతోనే పరిష్కృతి యోచించటం సహేతుకం.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

అబ్బురపరిచిన దంతబలుడు

ఆదివారం అనుబంధం స్నేహ చాలా బాగుంది. విజ్ఞాన వీచికలో చైనా మొబైల్స్ గురించి చాలా వివరంగా రాశారు. సమ్‌థింగ్ స్పెషల్‌లో దంత బలుడు కన్నెల చెంచారావు పళ్ల గట్టిదనం మమ్మల్ని ఎంతో అబ్బురపరిచింది. బాల నేస్తాలు పేజీలో చిత్ర విచిత్రం నిజమేనా. బొమ్మ కాస్త పెద్దదిగా వేసి ఉంటే అర్థమయ్యేది. తెల్సా శీర్షికలో విరుద్ధ పుష్పాలు, జంతువులు ప్రమాదాల్ని పసిగడతాయా స్టోరీలు బాగున్నాయి. రెక్కలు తెగిన గువ్వ సూపర్. నేటి తల్లిదండ్రులు పిల్లల చదువుల కోసం వారికి స్వేచ్ఛా, ఆనందాలను దూరం చేస్తున్న విధానం కళ్లకు కట్టినట్లుగా రాశారు. చిన్న పాప కెనడీ స్టోరీ, ఫొటోలు బాగున్నాయి. తన గురించి మరిన్ని వివరాలు పొందుపరిచి ఉంటే బాగుండేది. స్నేహలోని శీర్షికలు ఆకట్టుకుంటూ భద్రపరుచుకొనేలా ఉన్నాయి. మరిన్ని కొత్త శీర్షికలతో మరింతగా ఆకట్టుకొనేలా తీర్చిదిద్దుతారని ఆశిస్తున్నాం.

పి.ఆర్. చంద్రశేఖర్, శ్రీదేవి,
మల్లీశ్వరి, తిలకం.
సోమల, చిత్తూరు.

దంతబలుణ్ణి ప్రభుత్వమే చేరదీయాలి

ఫిబ్రవరి 15 ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహలో విజ్ఞాన వీచిక ద్వారా చైనా మొబైల్ ఫోన్‌కి సంబంధించిన విషయాలు తెల్సుకున్నాం. చూద్దామాలో మహోర్‌గఢ్ కోట గురించి అలనాటి సామ్రాజ్య చరిత్ర గురించి అనేక విషయాలు తెలియజేశారు. సమ్‌థింగ్ స్పెషల్ లో దంతబలుడు కన్నెల చెంచారావు తాపీ పని చేస్తూ డెబ్బైఆరు కేజీల బస్తాని దంతాలతో లేపి చరిత్ర సృష్టించాడు. ప్రభుత్వం స్పందించి, ఇలాంటి వాళ్లకోసం ఒలింపిక్స్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి చేరదీయాలని కోరుకుంటున్నాము. మెదడులో కణుతులు గురించి ఎన్నో వివరాలు తెల్సుకున్నాం. ఆరోగ్యం ద్వారా ఎప్పటికప్పుడు సీజనల్ వ్యాధులకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరిస్తున్నందుకు



ధన్యవాదాలు. 'చిన్న చిత్రాలదే చిద్విలాసం' అన్న అట్టమీదికథ చదివాం. ఈ చిత్రాలు విజయవంతం అయి నంది అవార్డులందుకున్న సినీతారలకు అభినందనలు. పెద్దపెద్ద హీరోలకే కాకుండా చిన్న హీరోలకీ ఆదరణ బాగానే ఉంది. ఇలా ఎన్నో చిత్రాల ద్వారా దర్శక నిర్మాతలకు మంచి గుర్తింపు రావాలని కోరుకుంటున్నాము. సమిష్టిజీవనంలో చలపాకప్రకాష్ గారు అందించిన అంశం బాగుంది. తెల్సా ద్వారా పోలీసుకుక్కలు నేరస్థుల్ని ఎలా కనిపెడతాయి? అలాగే జంతువులు ప్రమాదాన్ని ముందుగానే ఎలా పసిగడ్తాయి? వంటి చక్కనైన విషయాలను ఈ వారం స్నేహలో తెలియజేశారు. ఇంకా మంచి విషయాలను వారం వారం అభిమానులకు అందించాలని కోరుకుంటున్నాము.

అనుపోజు సంతోషి నాగరాజు,
విజయనగరం.

చిద్విలాసం

పిట్ట కొంచమైనా కూత ఘనం అన్నట్లు చిన్న బడ్జెట్టులోని చిరువ్యయ సినిమాలు విజయవంతమై విజయవిలాసం చేస్తున్నాయి.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు

మీ రచనలను, ఉత్తరాలను పంపవలసిన చిరునామా...

ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం

మోటూరు హనుమంతరావు భవన్, 21/1,

అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా,

హైదరాబాద్.

విజ్ఞాన వీచిక

అతి పెద్దది అతి చిన్నది





- డా॥కాకర్లమూడి విజయ్

శాస్త్రవేత్తలు నిత్యం ఏవో కొత్త విషయాలు కనిపెడుతూనే ఉంటారు. వాటిలో చాలా వరకు గత కాలపు జీవాల గురించీ, జీవనాల గురించీ, శిలాజాల గురించీ ఉండటం కద్దు.

అటువంటి తాజా పరిశోధనలో ఒక అద్భుతం వెలుగు చూసింది. ప్రపంచంలో ఇంతవరకూ కనీవినీ ఎరుగనంతటి పెద్ద సర్పాన్నీ, ఆ సర్పం తాలూకు అవశేషాల్ని కనుగొన్నారు. మనకు తెలిసినంతవరకూ కొండచిలువ జాతికి చెందిన విషరహిత సర్పం అనకొండ. దాదాపు 30 అడుగుల పొడవు పెరిగే అనకొండ కంటే చాలా పెద్దగా ఉండే పాములు సుమారు ఆరుకోట్ల సంవత్సరాలకు పూర్వం జీవించి వుండేవని అంచనా.

ఈ మహాసర్పాలు టైరానోసారస్ రెక్స్ అనే మహారాక్షస బల్లి (డైనోసార్) అంతరించిన ఆరు మిలియన్ (అరవై లక్షల) సంవత్సరాల తరువాత జీవించి వుండేవి. ఈ సర్పాలు దాదాపు 42 నుంచి 45 అడుగుల పొడవు పెరిగేవట. అంటే మహా డైనోసార్ అంత పొడవు! ఒక్కో సర్పం బరువు 11 నుంచి 15 వందల కిలోలు ఉండేది. ఈ మహా సర్పానికి టైటానోబోవా సరెహోనేసిస్ అనే పేరు పెట్టారు. ఈ శిలాజాన్ని కొలంబియా ప్రాంతంలోని సరెహోన్‌లో కనుగొన్నారు.

విశేషమేంటంటే శాస్త్రవేత్తలు ఈ సర్పానికి ఆహారంగా వున్న భారీ తాబేళ్ళ, అంతరించిపోయిన మొసళ్ల తాలూకు అవశేషాలూ లభించాయి.

ఈ సర్పం నివసించిన కాలం గురించి ఇంతకు ముందువరకు ఎటువంటి వివరాలు లభించలేదు. ఈ కొత్త శిలాజం లభించడంతో మహా రాక్షస బల్లులు అంతరించిపోయాక ఈ ప్రాంతంలో జీవాలు ఏ విధంగా వుండేవో అర్థమయ్యే అవకాశం లభించినట్టైంది.

ఈ భారీ పరిమాణం అప్పటి వాతావరణం ఎలా వుండేదో అంచనా వేసే వీలు కల్పించింది. ఇప్పటికీ జీవించివున్న శీతల రక్త జీవుల శరీర పరిమాణం గమనిస్తే, భూమధ్య రేఖకు దగ్గరగా వున్న ప్రాంతాలలో అవి భారీగా పెరగటం, శీతల ప్రాంతాల్లో అవి చిన్నగా వుండటం తెలుస్తుంది. ఆ ప్రకారం అంచనా వేస్తే, డైనోసార్ల కాలంలో లాగే టైటానోబోవా కాలంలో కూడా వాతావరణంలోని ఉష్ణోగ్రతలు చాలా ఎక్కువగా వుండేవని అర్థమౌతోంది. ఒక అంచనా ప్రకారం ఆరుకోట్ల సంవత్సరాల క్రితం దక్షిణ అమెరికా ప్రాంతంలోని ఉష్ణోగ్రతలు ప్రస్తుత స్థాయికంటే కనీసం పది డిగ్రీల అధికంగా వుండొచ్చని తేలింది.

అత్యంత భారీ సర్పం సంగతి అలా వుంటే అతి చిన్న పాముని కరేబియన్ ద్వీప ప్రాంతంలో కనుగొన్నారు. చూడటానికి చిన్న నూడిల్ ముక్కలా వుండే ఈ పాము కేవలం నాలుగంగుళాలు మాత్రమే పెరుగుతుంది. అత్యంత అరుదైన ఈ పాము అంతరించే దశలో వుందంటున్నారు. లెప్టోటిప్లాప్స్ కార్లే అని పేరు పెట్టబడిన ఈ పాము ఇప్పటివరకూ మనకు తెలిసిన 3,100 పాము జాతుల్లోకెల్లా అతి చిన్నది.

కొన్ని పాములు ఒకేసారి దాదాపు 100 గుడ్లు పెట్టగలవు. కానీ ఈ చిన్న పాము మాత్రం ఒక్కటే గుడ్డు పెడుతుంది. ఈ పాముని కనుగొన్న బ్లెయిర్ హెడ్జెస్ అనే జీవశాస్త్రవేత్త 65 జాతుల కప్పల్నీ, సరీసృపాల్నీ (కొత్త జాతులు) కనుగొన్నాడు.

ఈ లెక్కన చూస్తే ఈ ప్రకృతిలో మనకు తెలియని విశేషాలు ఇంకెన్ని వున్నాయో అనిపిస్తుంది.

★

ఒక బైకు... ఓ చెట్టు ... ప్రేమ కథ

"ప్రేమ అంటే ఇదిగో ఈ రూపంలోనే వుండాలి. వీరి మధ్యే వుండాలి" అని ఇప్పటి వరకూ ఎవరైనా అనుకుంటే మాత్రం అర్జంటుగా ఆ అభిప్రాయాన్ని మార్చుకోవాల్సిందేనండోయ్! ఎందుకంటే మన కళ్లెదుట కనిపిస్తున్న సీన్ అలాంటిది. ఫొటో చూశారుగా. పెద్ద వృక్షం, దాని మధ్యలో ఓ బైకు. ఈ రెంటినీ ఇలా చూస్తుంటే ఓ సిన్మా పాట గుర్తు రావడంలా! అదేనండీ...."ఎన్నెన్నో జన్మల బంధం నీదీ నాదీ...ఎన్నటికీ వీడని బంధం నాదీ నీదీ" అని. సర్సరి అసలు విషయానికొచ్చేద్దాం. ఈ సంఘటన కేరళలో 1985లో జరిగింది. ఓ వ్యక్తి సౌదీ అరేబియా వెళుతూ తన బైకును ఇదిగో ఇలా పెరట్లో వున్న ఈ చెట్టుకు ఆన్చి వెళ్లాడు. అప్పుడు ఈ చెట్టు చాలా చిన్నగా వుండేదిలెండి. అతనేమో చాలా ఏళ్ల తర్వాత కూడా ఇండియా రాలేదు. ఈ మధ్యకాలంలో... ఈ చెట్టూ బైకూ ప్రేమలో పడిపోయి... ఇదిగో ఈ జన్మకు ఇలా విడదీయరాని బంధం ఏర్పాటు చేసుకుందామనుకున్నాయి...చేసేసుకున్నాయి. ఇప్పుడు ఎవరైనా సరే బైకును బయటికి తీయాలీ అంటే దాని చుట్టూ పెనవేసుకున్న వృక్షరాజాన్ని రంపాలతో కోసో...గొడ్డళ్లతో నరికో మాత్రమే తీయగలరు. అయినా వాటిని వేరు చేయడం అంత అవసరమంటారా!



★

ఓ మంచి పుస్తకం

ప్రజా రచయితలకు
ధృవతార కొడవటిగంటి

నిజమైన కళాసాహిత్యాలకు మరణం ఉండదు. నిత్య కళ్యాణం, పచ్చతోరణంలా నిరంతరం కళకళలాడుతూనే ఉంటాయి. ఉత్సాహాన్ని స్ఫూర్తిని ఇస్తూనే ఉంటాయి. అలాంటి వాటిలో జీవలక్షణం నిత్యం తొణికిసలాడుతుండే వాస్తవాన్ని గ్రహించక తప్పదు. కళాసాహిత్యాలు ఎప్పుడైనా ఎక్కడైనా చెడును తుంచుకుంటూ మంచిని పెంచుకుంటూ పోతాయి. వాటికి శాస్త్రీయ, శ్రామికవర్గ దృక్పథ భావాలు తోడైతే ఇంకేముంది. తిరుగే ఉండదు. పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తాయి. కొడవటిగంటి కుటుంబరావు రచనలు ఆ విధంగా తెలుగు పాఠకులకు, రచయితలకు ఎనలేని సేవ చేశాయి. చేస్తున్నాయి. చేస్తూనే వుంటాయి.

- శైలి

వాస్తవాల నుంచి సత్యాలను గ్రహించడం, ఆ సత్యం ప్రాతిపదికపైనే తిరిగి వాస్తవాలను నిర్మించుకుపోవడం, పురోగమనంలో ఈ మార్పు సాధ్యమే అన్న చారిత్రక విశ్వాసాన్ని కల్గించడం శాస్త్రీయ దృక్పథం కలిగిన వారు చేస్తారు. అపకారాలకు అనర్థాలకు తావివ్వరు. అలాగే గరిష్టస్థాయిలో కష్టజీవులకు సామాన్యులకు మేలు చేస్తున్న వారిని తమంత తాముగా సంఘటిత శక్తితో ముందుకు నడిపించేలా చేస్తుంది శ్రామిక వర్గ దృక్పథం. మనిషికి విశాలమైన సామాజిక లక్షణంతో పాటు ఉద్యమ లక్షణం కూడా ఈ దృక్పథం వలన అలవడుతుంది. ఐతే ఈ మార్గంలో ఎవరి నిజాయితీని, నిబద్ధతను వారే ప్రశ్నించుకోవాల్సి ఉంటుంది. అందుకే మారిన జీవితంలో కథకుడు అన్నట్టు.. జీవితాన్ని గురించి లక్ష సత్యాలు తెలుసుకుని ఏం ప్రయోజనం? ఒక చిన్న సత్యానికి అనుగుణంగా జీవితాన్ని మార్చే శక్తి లేనప్పుడు?

మన
కొడవటిగంటి

కేతు విశ్వనాథ రెడ్డి

జీవితరంగం అంటే సంఘజీవితం. సంఘజీవితంలోని వాస్తవ విషయాల మధ్య కార్యాకారణాలను గ్రహించబడే జీవిత రంగంలో గల సత్యం; అంటే జీవిత సత్యాన్ని అవగాహన చేసుకోవడమే వాస్తవికత. మరోకరకంగా చెప్పాలంటే కంటికి కనిపించే వాస్తవంతోనే తృప్తి పడక, ఇలా ఉంటే 'మంచి'దనే కల్పనా దృష్టిని కనపరచాలి. అందువల్ల వాస్తవికత అనేది జీవితాన్ని చూసే పద్ధతి అవుతుంది. జీవితం మార్పుకు తోడ్పడే ధోరణి (ట్రెండ్) కూడా అవుతుంది. ఈ దృష్టితో చూసినపుడు వాస్తవికత అనేది సాహిత్యంలో సంఘ పరిణామాన్ని సూచించే ఒక రచనా పద్ధతి అనీ, సంఘ పరిణామాన్ని సూచించే ఒక ధోరణి అని తెలుతుంది. ఈ రచనా పద్ధతినే వాస్తవిక వాదం అని అంటారు'.

కొ.కు రచనల్లో ప్రాణప్రదమైన అతఃసూత్రం ఇదే. తెలుగునాట ప్రగతిశీల మేధావిగా, మహారచయితగా, సాహిత్యోద్యమశీలిగా, తెలుగువాళ్ళ ఆధునిక సంస్కృతీ పురోగమనానికి జీవిత పర్యంతం కృషిచేసిన కొడవటిగంటి కుటుంబరావు దాదాపు 50 ఏళ్ళ కాలంలో పది పన్నెండు వేల పేజీలకు మించిన సాహిత్యం రాశారు. 400కు పైగా కథలు, దాదాపు 80 గల్పికలు దాని రూపాంతరాలైన గల్పిక, బుల్లికథ, అభూత కల్పనలు, ఇరవై నవలలు, వంద దాకా రేడియో నాటికలు, రెండు మూడు సినిమా స్క్రిప్టులు రాశారు. ఆరేడు వందలకుపైగా సాహిత్య, సాంస్కృతిక, వైజ్ఞానిక వ్యాసాలు, ఫీచర్లు, పుస్తక సమీక్షలు, పుస్తక పరిచయాలు రాశారు. ఎన్ని రకాల సాహిత్యం రాశారో ఆ రకాలన్నీ అనువదించారు' అని కొ.కు రచనలపై విస్తృత అధ్యయనం చేసి, వారి సంపుటాలకు సంపాదకత్వం వహించిన ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డిగారు సాధికారికంగా తెలిపారు. మార్క్సిజంను నిరూపించడానికికాక జీవితాన్ని గురించే రాశానని, తనకు జీవితమే... జీవిత సత్య చిత్రణమే ప్రమాణమనీ, సాహిత్యం జీవిత వృక్షానికి పూసే పూవు- పువ్వుకు పువ్వులు పూయవు. సాహిత్యానికి పుట్టే సాహిత్యం కృతిమమైన కాగితం పువ్వు లాంటిదని భావించి జీవిత చిత్రణకే కట్టుబడిన మహారచయితగా కొడవగంటి కుటుంబరావును కేతు అభివర్ణించారు. వచనానికి ఆలోచనా విధానానికి ఆధ్యాత్మికతకు అభివృద్ధికి ఎడం లేదనే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాల్సిన ఆవశ్యకతను గురించి ప్రచారం చేసిన సాహిత్యోద్యమకారుడు కొ.కు అని కూడా పేర్కొన్నారు. ఓ ప్రజారచయితకు ఉండవలసిన లక్షణాలను కొ.కు నిలువుటద్దంలో ఇలా చూపారు.

20వ శతాబ్దానికి ప్రాతినిధ్యం వహించిన కొ.కు (1909-1980) సాహితీ రచనలను, సంపుటాలను ఏరి కూర్చే బాధ్యతను విశాలాంధ్రవారు కేతుకు అప్పగించారు. ఆ సందర్భంగా ఆ సంపుటాలకు రాసిన ముందుమాటలు, అలాగే కొకుపై మక్కువతో వివిధ పత్రికలకు మ్యాగజైన్‌లకు రాసిన వ్యాసాలన్నింటినీ సమకూర్చి ఇప్పుడు ఒక పుస్తకంగా తీసుకొచ్చారు.

కొండ అద్దమందు కొంచమై ఉండునన్న రీతిలో కొ.కు సాహిత్య వైశాల్యము, ఎత్తు, లోతు, సాంద్రత అన్ని వ్యాసాలూ చక్కగా వివరిస్తాయి. కొ.కు సాహిత్యంతో పరిచయం ఉన్న వారికి మరింత శక్తిని, లేనివారికి ఆశక్తిని కల్గిస్తాయనడంలో ఎటువంటి సందేహం అక్కర్లేదు. అక్కడక్కడ పునరుక్తి ఉన్నట్టు అన్పించినా ఆయా సందర్భాల్లో వర్గీకరణ ప్రాతిపదికన ఉల్లేఖనగానే వాటిని పరిగణించాలి.

కథకుడుగా కొ.కు విశిష్టత ఇలా చెప్తారు. కథానికా తత్త్వం ఇంకా పట్టుబడని జాతికి అదేమిటో తన కథల ద్వారా తెలిపిన కథకుడు. అలాగే కథను ఓ సామాజిక సంస్కార శక్తిగా నిరూపించాడు.

శ్రీశ్రీ అన్నట్టుగా కొ.కు ఆంధ్ర చెహోవ్ కాదు. విశ్వ సాహిత్యంలో చెహోవ్ ఒక్కడే ఉన్నాడు. అలాగే కొడవటిగంటి కూడా. తెలుగువాడు తప్ప మరెవ్వరూ రాయటానికి వీలులేని 'తాతయ్య, అమ్మమ్మ, తులశమ్మగారు, అమాయకురాలు" కథలు చాలు. తెలుగు ఎల్లలు దాటడానికి 'కులద్వేషం, నువ్వులూ తెలకపిండి, కొత్త జీవితం, తిండిదొంగ, మహా ఇల్లాలు' చాలు. భారతీయ కథకులను మించడానికి హింస, కురూపి, ఫోర్త్ డైమెన్షన్, స్వార్థ బుద్ధి, బకాసుర, దిబ్బరాజ్యం' కథలు, గ్రహశకలం, పట్నవాసం, పచ్చకాగితం వంటి కథలు విశ్వసాహిత్యంలోని ఏ మంచి కథకుని సరసనయినా కొ.కును నిలబడతాయి' అని పేర్కొన్నారు. ఈ మాటలు చాలు కొ.కు విశిష్టతను తెలపడానికి. పరిధి ఎట్లావున్నా కొ.కు లక్ష్యం మాత్రం మధ్య తరగతి దౌర్భల్య క్షాళనం. బ్రేక్అప్ అయ్యే తరగతి నుంచి ఎప్పుడూ కొత్త సామాజిక శక్తులు ఉత్పన్నమవుతూ ఉంటాయి. గడచిన నూరేళ్లకాలంలో వెలువడిన విప్లవాలన్నింటికీ దోహదం చేసింది మధ్య తరగతిలో ఉండి క్షాళనం పొందిన వాళ్లే. మరి ఈ అభిప్రాయం కలిగిన కొ.కును మధ్య తరగతికి చెందిన ఓ ప్రత్యేక రచయితగా భావించడం అత్యంత సహజమేకదా!

కాగా 'వర్గవ్యవస్థ విస్పష్ట ఆకారం ధరించని' ఒక చారిత్రక దశలో నిర్వర్తించవలసిన కర్తవ్య నిష్ఠ కొ.కు ది' అని తెలపడమంటేనే తెలుగు రచయితలకు ధృవతారను చూపినట్లయింది. కొ.కు 'చదువు' నవల ఎందుకు ప్రత్యేకమైనదో కేతు ఇలా వివరిస్తారు. 'ఘర్షణ తీవ్రంగా లేనప్పటికీ, అంతర్వైరుధ్యాలతో కూడిన పాత్రల ఆంతరంగిక ఘర్షణ ప్రాధాన్యం వహించినప్పటికీ, ఇది చారిత్రకంగా చదువు ద్వారా సాగే అనివార్యమైన ఘర్షణ. భూస్వామ్య సంస్కారాన్నే గాక, ధనస్వామ్య సంస్కారాన్ని కూడా అధిగమించి వెళ్ళే ఘర్షణ అన్న స్పృహను పాత్రలు కలగజేస్తాయి. ఈ స్పృహే ఈ నవలను తెలుగునవలా సాహిత్యంలో చారిత్రక వాస్తవికత వున్న అత్యుత్తమ నవలగా తీర్చిదిద్దింది. విశ్లేషణ కూడా ఇలా శాస్త్రీయ పద్ధతుల్లో సాగడం వలన ఈ దృక్కోణం నుంచి మరల కొ.కు రచనలు చదువుకుంటే మరిన్ని విషయాలు కొత్తగా స్ఫురించకమానవు.

మన కొడవగంటి పేరుతో 100 పేజీలతో ఉన్న ఈ వ్యాసాల సంపుటిని విరాట్ కమ్యూనికేషన్స్ వారు ప్రచురించారు. వెల రు. 50లు. ★

ఆరోగ్యం

వేసవి కాలం చెవి, ముక్కు గొంతు వ్యాధులు



డా॥ కెవిఎస్ఎస్ఆర్కె శాస్త్రి,
ఇఎన్టి వైద్య నిపుణులు,
యశోద హాస్పిటల్,
సోమాజిగూడ,
హైదరాబాద్.
ఫోన్ : 9848046437



ఈసారి ఎండలు ముందే వచ్చేశాయి. ఉదయం పది దాటితే బయటకు అడుగుపెట్టలేని పరిస్థితి. ఏప్రిల్, మే నెలలో నమోదవ్వాల్సిన ఉష్ణోగ్రతలు ఇప్పుడే వేడెక్కుతున్నాయి. అంతేకాక వాతావరణంలో మార్పుల వల్ల వ్యాధులొస్తాయి. చెవి, ముక్కు గొంతుకు సంబంధించిన సమస్యలు... ముక్కులోనుంచి రక్తస్రావం, గొంతు నొప్పి, గొంతు బొంగురుపోవడం వంటి సమస్యలొస్తాయి. వీటి గురించి ఈ వారం తెలుసుకుందాం...

ఎండలో తిరిగి ఇంటికి లేదా ఆఫీసుకు వచ్చిన వారికి బాగా దాహం వేస్తుంది. దీంతో చల్లని నీళ్ల తాగాలనుకుంటారు. ఈ చల్లటి నీళ్ల (కొన్ని సార్లు బయట ఐసు వేసిన నీళ్ల తాగడం) వల్లే గొంతు నొప్పి, జలుబు, టాన్సిలైటిస్, లారింజైటిస్, సైనసైటిస్ వస్తాయి. ఎక్కువ ఎండలో తిరిగి బాగా చల్లని నీరు తాగడం వల్ల ఈ వ్యాధులొస్తాయి. సాధారణంగా బయటికి ఎండలో వెళ్లి వచ్చిన వారిలో బయటి ఉష్ణోగ్రతకు, శరీరంలోని ఉష్ణోగ్రతకు తేడా వుంటుంది. ఈ సమయంలో చల్లటి నీరు తాగడం వల్ల (నీళ్లలోని క్రిముల వల్ల) గొంతు నొప్పి, జలుబు వచ్చే అవకాశం వుంటుంది.

ఇక ముక్కులో నుంచి రక్తం కారడానికి కారణం తీవ్రమైన ఎండ ముక్కులోని లైనింగ్ ఎండి పొడిబారిపోవడం. దీంతో రక్తనాళాలు చిట్లుతాయి. పదేళ్ల పైబడిన పిల్లల్లోనూ, యాభై ఏళ్ల పైబడిన పెద్దవారిలోనూ రక్తస్రావం అయ్యే అవకాశాలు ఎక్కువగా వున్నాయి. ఏ వయసు వారిలోనైనా రక్తస్రావం అవ్వొచ్చు. ముక్కు నుంచి రక్తస్రావం అయినప్పుడు ఐస్ ప్యాక్లు (గుడ్డలో ఐస్ ముక్కలు పెట్టినవి) ముక్కులో పెట్టుకోవాలి. దీంతో కారుతున్న రక్త స్రావం ఆగుతుంది. మళ్లీ మళ్లీ రక్తస్రావం ఎక్కువైతే ఈఎన్టి వైద్యుణ్ణి కలవాలి.60 ఏళ్లు దాటిన వాళ్లు, రక్తపోటు వున్నవాళ్లు, గుండె జబ్బు ఉన్నవాళ్లు రక్తం గడ్డకట్టే స్వభావం తగ్గించడానికి, రక్తం పలచబడడానికి టాబ్లెట్లు వాడతారు. వీటి వల్ల వేసవిలో రక్తస్రావం అయ్యే అవకాశముంది. ఈ సమయంలో కొద్ది రోజులు ఈ మందులను ఆపాల్సి వస్తుంది. అయితే వైద్యుల సూచన మేరకే మందులు ఆపాలి. ఆపడానికి సొంతగా నిర్ణయం తీసుకోకూడదు. చాలా మంది ఈ మందులును రెండు మూడు రోజులు తమంతట తామే వాడడం ఆపుతారు. దీంతో ఏ వ్యాధికైతే మందులు వాడుతున్నారో ఆ వ్యాధులు తిరగబెట్టే అవకాశముంది. అందుకని వైద్యుడి సలహా మేరకు మాత్రమే మందులు ఆపాలి. కొంత మంది చిన్న పిల్లల ముక్కులో రక్తం గడ్డలుంటాయి. అలాంటి వారిలో కూడా రక్తస్రావమయ్యే అవకాశముంది. ఒకటి రెండు సార్లు ఒక మాదిరి రక్తం కారితే ఫర్వాలేదు. కానీ రెండుసార్లకన్నా ఎక్కువ, తరచూ ముక్కు నుంచి రక్తస్రావమవుతుంటే ఇఎన్టి వైద్యుణ్ణి కలవాల్సిందే. కొంత మంది పిల్లల్లో థ్రాంబోసిస్ సైటోపిన్, హీమోఫీలియా వంటి వ్యాధుల వల్ల రక్తం గడ్డకట్టకుండా రక్తస్రావం అవుతుంది. దీనికి సంబంధించిన రక్తపరీక్షలు చేయించాలి. సమస్యను బట్టి చికిత్స చేయించాలి. ముక్కులో ఏర్పడిన పొక్కులను చేత్తో తీసెయ్యకూడదు. వేళ్లకున్న గోళ్ల వల్ల రక్తస్రావం అవుతుంది. శుభ్రమైన నీటితో ముక్కును కడుక్కుని పొక్కులు మెత్తగా అయిన తర్వాత మాత్రమే తీసెయ్యాలి.

ఎక్కువ నీళ్లు తాగాలి

సాధారణంగా రోజూ మూడు నుంచి నాలుగు లీటర్ల నీళ్లు తాగాలి. వేసవిలో అయితే ఇంకా ఎక్కువగా తాగాలి. అందుకు అవసరమైన ఏర్పాటు చేసుకోవాలి. సాధ్యమైనంత వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం నాలుగు వరకు బయట తిరగకపోవడమే మంచిది. తప్పనిసరి పరిస్థితుల్లో సురక్షితమైన నీరు వెంట వుండేలా చూడడం మంచిది. పలుచని మజ్జిగ, కొబ్బరి బొండాం తాగాలి.

చెవి నొప్పి

వేసవిలో తరచూ చిన్న పిల్లలు చెవినొప్పి అంటారు. వీరికి అకస్మాత్తుగా తీవ్రమైన చెవి నొప్పి వస్తుంటుంది. రాత్రి పడుకుని చెవి నొప్పితో నిద్రలేస్తారు. దీనికి కారణం జలుబు, గొంతు నొప్పి, ఎడినాయిడ్స్ గ్రంథి వాపు. వీటి వల్ల ఇన్ఫెక్షన్లు వస్తాయి. రెండు మూడు వారాల వరకు మందులు వాడితే తగ్గిపోతుంది.

వేసవిలో జలుబు

నీరు కలుషితం అవ్వడం వల్ల జలుబు వస్తుంది. ఏసి, ఫ్యాన్ కింద పడుకోవడం వల్ల జలుబు వస్తుంది. ఎక్కువగా ఫ్రిజ్ వాటర్ తాగడం వల్ల గొంతు నొప్పి వచ్చి గొంతు బొంగురుపోతుంది. కొన్నిసార్లు గొంతు నొప్పి ఇన్ఫెక్షన్ ఊపిరితిత్తులకు వ్యాపించే అవకాశముంది. లారింజైటిస్ యాంటిబయాటిక్స్ ఆవిరిపట్టాలి.

ఎండలో తిరగకూడదు

వేసవిలో చిన్నపిల్లలను ఎక్కువగా ఎండలో తిరగకుండా జాగ్రత్తపడాలి. బయట ప్రదేశాల్లో కాకుండా లోపల నిర్వహించే సమ్మర్ క్యాంపులకు పిల్లలను పంపించాలి. చాలామంది వేసవిలో విహార యాత్రలు, తీర్థ యాత్రలు పెళ్లిళ్లకు అధికంగా హాజరవుతుంటారు. వీటివల్ల ఎక్కువ మంది ఒకే చోట కలుస్తారు. దీంతో ఎవరికైనా జలుబు, దగ్గు ఉండి, ముక్కు చీదడం వల్ల ఈ ఇన్ఫెక్షన్లు ఇతరులకు వ్యాపిస్తాయి. చేతిరుమాలు అడ్డుపెట్టుకుని దగ్గడం, చీదడం చేయాలి. సమస్య తీవ్రమైతే సంబంధిత వైద్యుణ్ణి సంప్రదించాలి. ఇన్ఫెక్షన్లు వున్నప్పుడు ఫంక్షన్లకు వెళ్లకపోవడం మంచిది.

పెద్దవాళ్లు జాగ్రత్త

రక్తపోటు మందులు వాడే వారిలో ముక్కులో తీవ్రమైన రక్తస్రావం అయ్యే అవకాశముంది. అంతేకాదు ఒక్కోసారి అత్యవసర పరిస్థితి ఏర్పడొచ్చు. కారుతున్న రక్తం గడ్డకట్టడానికి ముక్కు లోపల ఐస్ ప్యాక్లు రెండు రోజుల పాటు పెట్టాల్సి వుంటుంది. ఆ తర్వాత తీసి ఎండోస్కోప్తో పరీక్షిస్తారు. కొన్నిసార్లు రక్తం ఎక్కించాల్సి వుంటుంది. రక్తస్రావం ఒక్కోసారి ఎక్కువైతే ఆ రక్తనాళంలోకి క్యాథటర్ పంపించి బ్లాక్ చేయాల్సి వుంటుంది. ★

బార్బీ బొమ్మ

- అల కొమ్మాలపాటి

బొమ్మల్లో బార్బీ బొమ్మకు ప్రపంచవ్యాప్తంగానే ప్రత్యేకమైన క్రేజ్ వుంది. షాపులో ఆ బొమ్మని గానీ పిల్లలుగాని చూశారూ అంటే పెద్దల పర్సు ఖాళీ అయిపోయినట్టే. అది కొనిచ్చే వరకు మారాం చేసేస్తారు. వాళ్లకు అంతగా నచ్చుతుంది మరి. అయినా బార్బీ బొమ్మ గురించి ఇంత పొడవు ఉపోద్ఘాతం అవసరం లేదనుకుంటా! అయితే ముందుగా మేం అన్న మాట కొద్దిగా ఆశ్చర్యంగా అనిపించొచ్చు. అదే... 'బార్బీ బామ్మ' అన్నాం కదా... ఆ విషయం. అలా అనక తప్పడం లేదు. ఎందుకంటే... "ఆ బొమ్మను మా చిన్నప్పటినుంచి చూస్తున్నాం. మేం ముసలివాళ్లమయ్యాంగానీ అది మాత్రం నిత్య యవ్వనంతో పాలుగారే బుగ్గలతో మిసమిసలాడిపోతోంది. దానికి వృద్ధాప్యమే లేదుమరి" అనే వారెందరో! తమాషా ఏంటంటే... దాని వయసు మాత్రం యాభై. అందుకే బామ్మ అనేశాం. ఇంతకీ బార్బీ బొమ్మ ఎప్పుడు పుట్టింది? దాని రూపకర్త ఎవరు? అసలు వారికి ఇంత అందమైన బొమ్మను చేయాలన్న ఆలోచన ఎలా వచ్చింది? వంటి ఆసక్తికర వివరాలు మీకోసం ప్రత్యేకంగా...

ఆశ్చర్యంగా అనిపించినా ఒక నిజాన్ని చెప్పుకోవాలి. బార్బీ బొమ్మ గత యాభయ్యేళ్లగా బొమ్మల మార్కెట్‌ను ఏలుతోంది. ఇంత కాలం పాటు ఒక బొమ్మకు ఇంత క్రేజ్ ఏ మాత్రం తగ్గకుండా వుందంటేనే దాని పట్ల పిల్లలకు, పెద్దలకు వున్న ఆకర్షణను అర్థంచేసుకోవచ్చు. ఓ మహిళ ఆలోచనలకు ప్రతిరూపమే ఈ బార్బీ. ఒక బొమ్మ ఇంతమంది మనసులను దోచుకోడానికి అది కూడా కారణమై వుండవచ్చు.

బార్బీ బ్రహ్మ

బార్బీ బొమ్మను సృష్టించింది ఎవరూ అంటే అమెరికాకు చెందిన మహిళా పారిశ్రామికవేత్త రూత్ హాండ్లర్. ఈమెకు ఒక కూతురుండేది. తను ఆడుకునే బొమ్మలను తరచూ పెద్దవాళ్లకులాగా అలంకరించడం గమనించింది. పైగా అలా తయారుచేసి చాలా సంతోషంగా ఆడుకోవడం కూడా ఆవిడ కళ్లల్లో పడింది. అప్పట్లో ఎక్కువగా పిల్లల బొమ్మలంటే బాగా పసివాళ్ల రూపాలే వుండేవి. చాలారోజులపాటు ఆమె ఈ విషయాన్నే ఆలోచించింది. పిల్లల ఆశలకు... మార్కెట్లో లభించే బొమ్మలకు మధ్య ఏదో అంతరం వున్నట్టనిపించింది. ఆ అంతరాన్ని చెరిపేసే బొమ్మను తయారుచేయాలనుకుంది. వెంటనే భర్తకు అదే విషయం చెప్పింది. ఆయన పెదవి విరిచాడు. పైగా వాళ్ల కంపెనీ (మట్టెల్ బొమ్మల కంపెనీ) డైరెక్టర్లుకూడా అదే విధంగా స్పందించారు. అప్పటికి ఊరుకున్నా... మనసులో మాత్రం ఆ ఆలోచన అలాగే వుందామెకు. ఆ తర్వాత 1956లో తన పిల్లలు బార్బారా, కెన్నెత్‌లతో కలిసి

బార్బీ అసలు పేరు: బార్బీ మిలిసెంట్ రాబర్ట్స్
ముద్దు పేరు: బార్బీ
బొమ్మ రూపశిల్పి: రూత్ హాండ్లర్
మార్కెట్లోకి వచ్చింది: 1959, మార్చి 9
మొట్టమొదట బార్బీ బొమ్మ ధర: 3 డాలర్లు (1959లో)
1959లో అమ్ముడైన బార్బీ బొమ్మలు: 350,000
1959 తర్వాత అమ్ముడైన బొమ్మల సంఖ్య: ఒక బిలియన్

యూరప్ పర్యటించింది. అప్పుడే 'బిల్డ్ లిల్లీ' అనే జర్మన్ బొమ్మ ఆమెను ఎంతగానో ఆకట్టుకుంది. బొమ్మల స్వరూపాన్ని ఏ రకంగా అయితే మార్చాలని తన మనసులో అనుకుందో సరిగ్గా ఆ బొమ్మ అలాగే వుంది. వెంటనే ఆమె మూడు బొమ్మలు కొని ఒకటి పాపకు ఇచ్చింది. అమెరికా తిరిగి వచ్చాక ఇంజనీర్ జాక్ సాయంతో దాని రూపం మార్చి 'బార్బీ' అన్న నామకరణం కూడా చేసేసింది. అయితే ఇందుకు సరిగ్గా మూడు సంవత్సరాలు పట్టింది. అలా జన్మించిన బార్బీ...1959 మార్చ్ 9వ తేదీన న్యూయార్క్‌లో జరిగిన అమెరికన్ అంతర్జాతీయ బొమ్మల ప్రదర్శనలో మొట్టమొదటిసారిగా ప్రపంచానికి కనిపించింది. ఈ తేదీనే బార్బీ పుట్టినరోజుగా కూడా పరిగణిస్తారు. మట్టెల్ కంపెనీ 'బిల్డ్ లిల్లీ' హక్కులు కొనడంతో 1964 నుంచి ఆ బొమ్మ మార్కెట్లో కనిపించడం మానేసింది. అలా బొమ్మల మార్కెట్లో బార్బీ ఏకఛత్రాధిపత్యం సాధించింది. మొట్టమొదటి బార్బీ బొమ్మకు చక్కటి పోనీటెయిల్, నలుపు-తెలుపు జీబ్రా చారల స్విమ్ సూట్ వుండేది. చేతిలో చలువ కళ్లద్దాలు, చెవులకు రింగులు వుండేవి. తొట్టతొలి బార్బీ బొమ్మలను మాత్రం జపాన్‌లో తయారుచేశారు. అలాగే వాటి బొమ్మలను కూడా జపాన్ కార్మికులే చేతితో కుట్టారు. బార్బీ బొమ్మ మార్కెట్లోకి వచ్చిన తొలి సంవత్సరమే 350,000 బొమ్మలు అమ్ముడయ్యాయి. అయితే బార్బీ బొమ్మ పిల్లల రూపులో కాక పెద్దల ఆకారంలో వుండడం కొందరు తల్లిదండ్రులకు నచ్చలేదు. ఏదైతేనేం బార్బీ ఆకారాన్ని బోలెడన్నిసార్లు మార్చారు. పక్క చూపులు చూసే బార్బీ ఇప్పుడు నేరుగా చూడడం ఇందులో ప్రధానమైన మార్పు.

మార్కెట్ మాయజాలం

అమ్ముకునేవాళ్లకు తెలివితేటలు ఎప్పుడూ ఎక్కువే. అస్తమానం ఒకే రకం బొమ్మను మార్కెట్లో పెడితే ఎవరు కొంటారు? అందుకే బార్బీ బొమ్మ స్నేహితులనీ, పెంపుడు జంతువులనీ, తోబుట్టువులనీ...ఎవరో ఒకరిని మార్కెట్లోకి పరిచయం చేస్తూనే వచ్చింది రూత్ హాండ్లర్. జనాలు నేటికీ కొంటూనే వున్నారు. నమ్మకం కుదరకపోవచ్చుకానీ బార్బీకి 17 పెంపుడు కుక్కలు, 12 గుర్రాలు, ఐదు పిల్లులు, 5 బుల్లి గుర్రాలు (అన్నీ బొమ్మలే అనుకోండి) వున్నాయి. కొన్ని దేశాల్లో బార్బీ బొమ్మకు ప్రత్యామ్నాయంగా వేరే బొమ్మలు లభిస్తున్నా తొలి స్థానం మాత్రం బార్బీదే. పైగా ఎందరో అమ్మాయిలు బార్బీ ఫ్యాషన్లను అనుకరించడం మొదలెట్టారు. కూడనిదే అయినా ఆ బొమ్మలా నాజూగ్గా వుండాలని తిండికూడా తగ్గించుకున్నారంటేనే ఆ బొమ్మ పట్ల ఎంత మోజు వుందో తెలుస్తోంది.

బొమ్మల మార్కెట్లో ఎదురులేని మహిళగా నిరూపించుకున్న హాండ్లర్ క్యాన్సర్ వ్యాధితో 2002లో తన 85వ ఏట మరణించింది. ఇవీ బార్బీ బొమ్మ సారీ...బొమ్మ పుట్టుపూర్వోత్తరాలు!

బార్బీ మ్యూజియం

ఓరోజు ఇజె రబెల్ (డచ్ దేశస్థురాలు) మార్కెట్‌కెళ్లింది. అక్కడ తమ చిన్నారి పాప మెరీనా కోసం ఒక బొమ్మ కొంది. పాపకి ఆబొమ్మ అస్సలు నచ్చలేదు. ఇంట్లో ఓ మూలకు విసిరేసింది. ఎందుకో తెలీదుకానీ పాప విసిరేసిన బొమ్మ ఇజెను బాగా ఆకర్షించింది. ఆ బొమ్మ మరేదో కాదు! బార్బీనే. దానికి బట్టలు మార్చే అవకాశం వుండడం ఆమెను ఎంతగానో ఆకట్టుకుంది. పైగా జుట్టు కూడా కావాల్సిన విధంగా మార్చుకునే సౌకర్యం ఆమెను మరింత కట్టిపడేసింది. ఇక అప్పటినుంచి ఆమె మార్కెట్లోకి వచ్చిన రకరకాల బార్బీ బొమ్మలను కొననారంభించింది. అలా 1960 నుంచి సొంతంగా బార్బీ బొమ్మలను సేకరించసాగింది. ఆ హాబీని ఆమె 2002 వరకూ కొనసాగించింది (అదీ తనకు అల్జీమర్స్ వ్యాధి సోకే దాకా)! ఇంతకీ ఆమె తన జీవిత కాలంలో పోగు చేసిన బార్బీ బొమ్మలు ఎన్నంటే అక్షరాలా 4000. అత్యధిక బార్బీ బొమ్మలను సేకరించిన వ్యక్తిగా నిలిచిపోయింది ఇజె. ఈమధ్యే ఆ బొమ్మలను 100,000 పౌండ్లకు (72 లక్షల రూపాయలు) అమ్మేశారు.

'బార్బీ'తో రూత్ హాండ్లర్

★

చూద్దామా



శిథిల సౌధాలు చెప్పే ఊసులెన్నో...

అలనాటి విజయనగర సామ్రాజ్యానికి రాజధాని... హంపి. చారిత్రక శిథిలాల నగరం. ఒకప్పుడు రత్నాలు రాశులుగా పోసి అమ్మారా నగర వీధుల్లో... అంతటి వైభోగమూ కాలానికి తల వంచక తప్పలేదు. రాజులు పోయారు... రాజ్యాలూ కాలగర్భంలో కలిసిపోయాయి. అయితే రాయలనాటి రాజసౌధాల అవశేషాలు మాత్రం నాటి వైభవాలకు మూగసాక్షులుగా మిగిలాయి. పురాతత్వ శాస్త్రవేత్తలు గత కొన్నేళ్లగా జరుపుతున్న తవ్వకాలలో ఆ ఆనవాళ్లు బయటపడుతున్నాయి. అవే మనకు ఎన్నో విషయాలను తెలియచేస్తున్నాయి.

ధాతునామ సంవత్సరం (క్రీ.శ 1336) వైశాఖ శుద్ధ సప్తమినాడు తుంగభద్రాతీరాన విద్యారణ్యస్వామి ఆశీస్సులతో హరిహర, బుక్క రాయలనే సోదరులు విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు. అనంతరకాలంలో రాయల వంశీకులు అనేక దండయాత్రలు చేసి తమ సామ్రాజ్యాన్ని విస్తరించారు. శ్రీకృష్ణదేవరాయల హయాంలో దక్షిణాది మొత్తం రాయల పాలన కిందకు వచ్చింది. ఆయన కుమారుడు తిరుమలరాయలకు ఆరో ఏటే పట్టాభిషేకం చేసినప్పటికీ చిన్న వయసులోనే మరణించాడు. అనుమానంతో రాయలు మహామంత్రి తిమ్మరుసును గుడ్డివాడిగా చేశాడు. ఆ బాధతోనే మానసికంగా కుంగిపోయిన రాయలు నాలుగు పదులు దాటిన వయసులోనే కన్ను మూశాడు. తాను మరణించే ముందు.. చంద్రగిరిని పాలిస్తున్న సోదరుడు అచ్యుతదేవరాయలను రాజును చేశాడు. 1542లో అధికారం రామరాయల చేతికి వచ్చింది. కానీ ముసల్మానులు మధ్య విభేదాలను అలుసుగా తీసుకుని అవకాశవాదంతో ప్రవర్తించాడు. ఆ విషయాన్ని గ్రహించి దక్కను సుల్తానులు ఏకమై చేసిన దాడిలో రామరాయలు మరణించాడు. మళ్లీ ఎప్పటికో అతని సోదరుడు తిరుమల దేవరాయలు విజయనగరం చేరుకున్నప్పటికీ శ్మశానంలా మారిన ఆ ప్రాంతాన్ని ఏలుకోలేక పెనుగొండకు వెళ్లిపోయాడంటారు.

శ్రీకృష్ణ దేవరాయలు కాకుండా విజయనగర రాజులలో చెప్పదగిన రాజు ప్రౌఢదేవరాయలు (రెండో దేవరాయలు). ఇన్నేళ్లుగా హంపిలో జరుగుతున్న తవ్వకాలలో బయల్పడుతున్న కోటగోడలు, మంటపాలు, మందిరాలు, దేవాలయాలు 32 చదరపు మైళ్ల (సుమారు 100 కిలోమీటర్ల వైశాల్యంలో ఏడు ప్రాకారాలతో నాటి రోమ్ (ఇటలీ) వంటి మహానగరాలకు ఏమాత్రం తీసిపోని విధంగా సిరులతో తులతూగే నగరమని విజయనగర రాజధాని హంపి గురించి విదేశీయాత్రికులు, రాయబారులు, వ్యాపారులు ఎంతో ఘనంగా వర్ణించారు. అప్పటికే విజయనగర రాజుల ఆధీనంలో 300 ఓడరేవులు ఉండేవి. అందుకే విదేశీ వర్తకం అంతగా అభివృద్ధి చెందింది. సర్వే ఆఫ్ ఇండియా (ఎ.ఎస్.ఐ) ఇక్కడ తవ్వకాలు జరుపుతూ వస్తోంది. అంతకు ముందే 1922లో 'లాంగ్ హరెస్ట్' అనే ఆంగ్లేయుడు రాయలపాలన తాలూకు అవశేషాల కోసం అన్వేషణ సాగించాడు. అప్పుడు లోటస్ మహల్, ఎలిఫెంట్ స్టేబుల్ (ఏనుగుల శాల,) క్వీన్‌బాత్ (రాణుల స్నానఘట్టం), వాచ్ టవర్ (కాపలా అర), అండర్ గ్రౌండ్ టెంపుల్ (అంతర్భూదేవాలయం)... ఇలా ఎన్నో కట్టడాలు వెలుగు చూశాయి. ఇవన్నీ విజయనగర వైభవాన్ని తెలిపే ఆనవాళ్లే అయినప్పటికీ అతిముఖ్యమైన రాజభవనాల శిథిలాలను మాత్రం ఆనాడు కనుగొనలేపోయారు. అసలు అవి నిర్మించిన ప్రాంతమేదో కూడా అప్పట్లో గుర్తించలేకపోయారు.

రాజదర్బారు

విజయనగర రాజులందరిలోకీ గొప్ప రాజనీతిజ్ఞుడు, ఆర్థికవేత్త, వ్యూహనిపుణుడు కవిపోషకుడు, కవి అయిన శ్రీకృష్ణదేవరాయలవారి ఆస్థానం ఎలా ఉండేదో, అష్టదిగ్గజాలకు ఆతిథ్య మిచ్చిన భవనవిజయం ఎక్కడ ఉండేదోనన్న కుతూహలం ప్రతి ఒక్కరికీ ఉంటుంది. దీనికి సంబంధించిన అవశేషాలను, స్మారకాలను పురాతత్వ శాస్త్రవేత్తలు ఈ ఒకటిన్నర దశాబ్ద కాలంలో కొంతమేరకు వెలికితీయగలిగారు. వాటిలో .. హరిహర రాయన అరమనె (హరిహరరాయల రాజభవనం) శ్రీకృష్ణదేవరాయల వారి రాజప్రాంగణం, కోశాదికార్ల దండనాయకుల భవనాలు.. వంటి ఎన్నో ప్రధాన కట్టడాల శిథిలాలు వున్నాయి. 'వీర హరిహర రాయన అరమనె' అనే ఒక శాసనం కూడా తవ్వకాలలో బయటపడింది. అప్పటి వాస్తు పద్ధతి ప్రకారం మొదటి మెట్టు ఎక్కగానే విశాలమైన ప్రదేశం, అలాగే రెండు మూడు మెట్లు కూడా ఉంటాయి. ఆపై పెద్ద రాజదర్బారు. సింహాసనం ఉండేవని ఆధారాల ద్వారా తెలుస్తోంది. ఈ విశాల

ప్రదేశాల చుట్టూ అనేక గదులు ఉన్నట్లుగా ఆధారాలు కనిపిస్తున్నాయి. ప్రధాన ద్వారానికి పక్కగా గోడవారన మరో ప్రత్యేకమైన దారి ఒకటి కనిపిస్తోంది. రాజదర్శనానికి ఎవరైనా సేవకులు ఈ పక్కదారి గుండా సరాసరి రాజుగారి సింహాసనం వద్దకు వెళ్లే వీలుంది. భవనం కింది అంతస్థు పునాదులను బలమైన కొండరాళ్లతో పై అంతస్థులను మేలిరకమైన కొయ్యతో నిర్మించారని నాటి రాయబారులు రాసుకున్న డైరీల ద్వారా తెలుస్తోంది. బహమనీ సుల్తానుల దండయాత్రల తర్వాత పోషణ కరవై ఈ భవనాలన్నీ ఎండకు ఎండి, వానకు తడిసి చెదపురుగులకు ఆవాసమయ్యాయి. దీంతో చెక్కతో కట్టిన భాగాలు మట్టితో కలిసిపోయాయి. రాతితో నిర్మించిన భాగాలు మాత్రం శిథిలాల రూపంలో ఇంకా మిగిలే ఉన్నాయి.



యాత్రికులు

563 ఏళ్లకిత్రం... 1443లో పర్షియన్ చక్రవర్తి షారుఖ్ ఆదేశాల ప్రకారం అబ్దుల్‌రజాక్ అనే రాయబారి విజయనగరాన్ని సందర్శించాడు. ఆ మహాసామ్రాజ్యంతో దౌత్యసంబంధాలను మెరుగు పర్చుకునేందుకు ఆరునెలలకు పైగా ప్రౌఢ దేవరాయల ఆస్థానంలో విడిది చేశాడు. ఆ కాలం నాటి సంప్రదాయాలు, సేవకులు, వ్యక్తుల స్వభావాల గురించి ఆ రాయబారి విపులంగా రాసుకున్నారు. దాని ప్రకారం.. అబ్దుల్‌రజాక్ మొదటి సారిగా వచ్చినప్పుడు ఆ విషయాన్ని రాయలవారికి ఎరుకపరచిన సిబ్బంది అతడిని సాదరంగా సకల రాజలాంఛనాలతో లోపలికి ఆహ్వానించి అప్పటి ఆచారం ప్రకారం తాంబూలం, బంగారు వరహాలు ఇచ్చి మర్యాదలు చేశారు. ఆ తరువాత మహారాజు అతనితో మాట్లాడి మళ్లీ తాంబూలం, సువర్ణ నాణేలు అందజేశారు. హంపి ప్రాంతమంతా అప్పట్లో కొండగుట్టలతో నిండి ఉండేది. వాటిపైనే జనం ఆవాసాలు ఏర్పరచుకుని నివసించే వారు. చీకటి పడగానే ఆముదపు దీపాలు వెలిగించడంతో దూరానికి కూడా ఆ ప్రాంతమంతా సముద్రంలో ఓడలాగా కనిపించేదని ఆ రాయబారి రాసుకున్నాడు.

రాయలవారి రాజభవనం

ప్రసిద్ధి చెందిన హజరరామ దేవాలయం సమీపాన జరిపిన తవ్వకాలలో అసలు కథానయకుడు శ్రీకృష్ణదేవరాయల రాజభవనం వెలుగు చూసింది. అత్యంత విశాలమైన ప్రదేశంలో ఎత్తైన కోటగోడల మధ్య రాయలవారి కోట, ఆయన భార్యలు చిన్నాదేవి, తిరుమల దేవి, జగన్మోహినిల నివాసాలు నిర్మితమైన ఉన్నాయి. ఆ కాలంలో ఇక్కడకు వచ్చిన పోర్చుగీసు దేశస్థులు ఫయాజ్, నూనిజ్‌లు రాయలవారి వైభవం గురించి సవివరంగా రాసుకున్నారు. వాటిని ఆధారం చేసుకుని నిర్దిష్టమైన కొలతల ప్రకారం తవ్వకాలు జరపగా రాయలవారి రాజగృహం బయల్పడింది. ఈ భవనం ముందు రెండు స్త్రీమూర్తుల విగ్రహాలు ఉండేవట. ఆ శిల్పాల సౌందర్యాన్ని చూచి విస్తుపోయిన ఫయాజ్ ఇవి శిల్పాలా లేక సజీవ సుందరులా అని ఆశ్చర్యానికి గురైనట్లు రాసుకున్నాడు. రాజభవనం లోపలకు వెళ్లగానే రెండువైపులా గోడలకు ఆనుకుని ఉన్న రాయలవారి తాతముత్తాతల విగ్రహాలు కనిపించాయి. వాటన్నిటినీ దాటుకుని వెళ్లగా దర్బారులో చక్కటి పచ్చరాతిపై ఆశీనుడైఉన్న కృష్ణదేవరాయలు కనిపించాడు. రాయల సన్నిధికి వెళ్లేలోగా మూడు ముఖ్యమైన ద్వారాలను దాటి వెళ్లినట్టు ఫయాజ్ రాసుకున్నాడు. ప్రతీ ద్వారం వద్దా వారిని సోదా చేసి, వారి వద్ద ఉన్న సొమ్ము లెక్కించారట. భవనంలో స్తంభాలు బంగారుపూతతో మెరిసిపోతూ నిజంగానే స్వర్ణంతోనే చేశారా అని భ్రమించేలా ఉన్నాయట. ఒక భాగంలో నాట్యం (రాజవంశీకులు మాత్రమే) నేర్చుకునేందుకు వీలుగా వివిధ భంగిమల్లో చెక్కిన శిల్పాలు ఉన్నాయని ప్రస్తావించాడు. మరొక గది దివంగతులైన మహారాజుకి అంకితం. ఆ రాజు వాడిన వస్తువులను ఆ గదిలో భద్రపరచి తాళం వేసి ఉంచారనీ ఏటా ఆయన జ్ఞాపకార్థం కొన్ని బంగారునాణేలను అందులో భద్రపరచేవారనీ రాజ్యం కరవు కాటకాలకు గురైనప్పుడు ఆ గది తాళం తెరచి బంగారు నాణేలను పునరావాసానికి ఉపయోగించేవారనీ వివరించాడు. ఆ సౌధంలో మరోవైపు బంగారు ఊయల. ఆ ఊయల బల్లకూ కాంచన కాంతులే. ఇంతటి వైభవోపేతమైన రాజభవనాన్ని తాను అంతకు మునుపెన్నడూ చూడలేదని ఫయాజ్ ఎంతగానో ప్రస్తుతించాడు.

పరిశీలించి చూస్తే రాయలవారి కోటకు కాస్తంత దూరంలో పట్టపురాణుల నివాసాల ఆనవాళ్లు కనిపిస్తాయి. రాజభవనానికీ రాణుల నివాసాలకూ మధ్య పెద్ద అడ్డుగోడ. 20 అడుగుల ఎత్తుండే ఆ మహాప్రాకారానికి మధ్యంలో ఓ ద్వారం ఆ దారి గుండానే రాయలవారు భార్యల అంతరంగిక మందిరాలలోకి ప్రవేశించేవారని లభ్యమైన ఆధారాలను బట్టి తెలుస్తోంది. ఆయన భార్యలలో



ఏకశిలా విగ్రహాల మ్యూజియం

1989 నుంచి హంపి పరిసర ప్రాంతాలలో జరుపుతున్న తవ్వకాలలో బయటపడిన ఏకశిలా విగ్రహాలతో ఆర్కియాలజీ వారు మ్యూజియంను ఏర్పాటు చేశారు. హంపికి సమీపంలోని కమలాపూర్‌లో ఉన్న ఈ పురావస్తు ప్రదర్శనశాలలో రాయల వైభవానికి సంబంధించి ఎన్నో పురాతన అవశేషాలనూ... ఆనాడు చలామణిలో ఉన్న బంగారునాణాలనూ, చూడవచ్చు. ఒక్క మీట నొక్కితే విజయనగర చరిత్రను కళ్లముందుంచే 'కియోస్క్'ను కూడా సందర్శకుల కోసం అక్కడ ఏర్పాటు చేశారు. మైళ్ల కొద్దీ విస్తరించి ఉన్న శిథిలాలన్నిటినీ చూసే అవకాశం, సమయం లేని పర్యాటకులకు ఈ కియోస్క్ ఎంతో ఉపయోగకరం. అలాగే... విజయనగర సామ్రాజ్యంపై పరిశోధనలు చేసే విద్యార్థులు, రీసెర్చిస్కాలర్లకు ఉపయోగపడే విధంగా హంపి చరిత్రపై వచ్చిన రెండువేలకు పైగా పుస్తకాలు మ్యూజియంలో అందుబాటులో ఉన్నాయి.



తిరుమలదేవికీ, చిన్నాదేవికీ ఆడపిల్లలే పుట్టారు. అయితే జగన్మోహిని (గజపతి రాజులపై దండయాత్ర సాగించిన కృష్ణదేవరాయలు కటక్ మహారాజును ఓడించి ఆయన కుమార్తె చేయందుకున్నాడు. ఆమే జగన్మోహిని)కి మగపిల్లాడు జన్మించాడు. అతడే తిరుమల రాయలు.

ఇలా నిర్మించారు...

ఆర్కియాలజీ వారి తవ్వకాలలో బయటపడిన రాజసౌధాల అవశేషాలను పరిశీలిస్తే... రాతిగోడలతో నిర్మించిన చతురస్రాకారపు మహారాజ ప్రాంగణం కనిపిస్తుంది. ఈరాతి గోడకు సమాంతరంగా కొంత వెడల్పుగా అలాంటి రాతిగోడలే నిర్మించారు. రాణివాసపు స్త్రీలు ఈ రాతి గోడల మధ్య మాత్రమే సంచరించేవారు. వారిని పరులెవ్వరూ చూసేందుకు వీలులేని విధంగా, వారి మాటలు సైతం ఎవరికీ వినబడకుండా ఉండేందుకు ఆ గోడల్ని సుమారు రెండు మూడడుగుల మందాన నిర్మించారు. రాజప్రాంగణం నుంచి హజారరామ దేవాలయం వరకూ ఈ గోడలను కట్టారు. ఆలయాన్ని రాజూ రాణీ దర్శించే సమయంలో ఆ చుట్టుపక్కలకు ఎవరినీ అనుమతించే వారు కాదని ఆధారాలను బట్టి తెలుస్తోంది.

తవ్వకాలిలా...

ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సదరన్ సర్కిల్ గతంలో మద్రాసు ప్రభుత్వం ఆధీనంలో ఉండేది. కర్ణాటక, కేరళ, మద్రాసు, దీంట్లో సభ్యరాష్ట్రాలు. ఈ ఒక్క కార్యాలయం మూడు రాష్ట్రాలలోని అన్ని చారిత్రక ప్రదేశాలను పర్యవేక్షించడం, కాపాడటం చాలా కష్టంగా ఉండేది. ఈ విషయాన్ని గమనించిన భారత ప్రభుత్వం 1978లో ఎ.ఎస్.ఐ బెంగుళూరు సర్కిల్‌ను ఏర్పాటు చేసింది. ఈ విభాగం 1989లో 'హంపి తవ్వకాల ప్రత్యేక ప్రాజెక్టుకు రూపకల్పన చేయడంతో కాలక్రమేణా అనేక చారిత్రక అవశేషాలు లభ్యమయ్యాయి. మొదటగా విజయనగర కాలంనాటి నల్లరాతితో నిర్మించిన పుష్కరణి, సైనికులు విడిది చేసే మంటపాలు బయటపడ్డాయి. కృష్ణదేవరాయల రాజప్రాంగణం, ఎలాగైనా వెలికి తీయాలన్న పట్టుదలతో తవ్వకాలు ముమ్మరం చేశారు. 'రాయల్ ఎన్‌క్లోజర్' అని పిలుస్తున్న ప్రాంతంలో అవన్నీ క్రమంగా బయటపడుతూ వచ్చాయి. నిజానికి ... తవ్వకాలు జరిపి ఆ భవనాల ఆనవాళ్లను వెలికి తీసిన సమయంలో ఏది ఏ భవనమో అనేది సరిగ్గా తెలియలేదు. అప్పట్లో విజయనగర సామ్రాజ్యాన్ని సందర్శించిన ఫయాజ్, నూనిజ్‌ల డైరీల ఆధారంగా బయటపడిన వాటిలో ఒక కట్టడం రాయలవారి దర్బారనీ.. మరో కట్టడపు అవశేషాలు హరిహర రాయన అరమనె అనే విషయాన్ని అబ్దుల్ రజాక్ డైరీ ఆధారంగా నిర్ధారించారట. ప్రపంచ సాంస్కృతిక ప్రదేశాలు (వరల్డ్‌హెరిటేజ్ సైట్)గా దేశంలో యునెస్కో గుర్తించిన 17 ప్రాంతాలలో హంపి కూడా ఒకటి. కానీ మిగతా పదహారు ప్రదేశాలకూ లేని ముప్పు ఈ ప్రాంతానికి పొంచి ఉందని యునెస్కో ప్రకటించింది. ఏదేమైనా హంపి శిథిలాల పరిరక్షణకు సానుకూలంగా స్పందిస్తే హంపి శిథిలాలు మరెన్నో ఊసులు చెబుతాయి.... మూగగానే.

★



అతి పెద్ద వజ్రం



దక్షిణాఫ్రికాలోని ప్రీమియర్ డైమండ్ మైన్స్‌లో 1905లో ప్రపంచంలో కెల్లా అతి పెద్ద వజ్రాన్ని కనుగొన్నారు. 3, 106 క్యారెట్ల బరువున్న ఆ వజ్రం పూర్తిగా తెల్లని రంగులో వుండేది. ఆరోజుల్లో దక్షిణాఫ్రికా బ్రిటన్ వలసగా వుండేది. బ్రిటిష్ చక్రవర్తి ఎడ్వర్డ్ 7కు ఆయన పుట్టిన రోజునాడు బహూకరించడం కోసం ట్రాన్స్‌వాల్ ప్రభుత్వం ఆ వజ్రాన్ని 1,50,000 పౌండ్లకు కొనుగోలు చేసింది. అయితే దానిని లండన్‌కు తరలించే మార్గ మధ్యంలో దానినెవ్వరైనా దొంగిలిస్తారేమోనని అధికారులు భయపడ్డారు. అందుకోసం దానికి రక్షణగా కొన్ని చర్యలు చేపట్టారు. ఆ వజ్రాన్ని ఒక పెట్టిలో ఉంచి లండన్‌కు తీసుకు వెళ్తున్నారు. అయితే ప్రిటోరియ నుండి కేప్‌టౌన్ వరకు రైల్ లోనూ ఆ తరువాత లండన్‌కు ఓడలోనూ ప్రయాణించవలసి వుంది. వజ్రం ఉన్న పెట్టెను సాయుధులు కంటికి రెప్పలా పహారాకాస్తూ తీసుకువెళ్ళారు. లండన్ చేరుకోగానే వజ్రాన్ని ఒక బ్యాంకులో ఉంచే నిమిత్తం ఒక ప్రత్యేక కారు ఓడ వద్దకు వచ్చింది. బ్యాంకు వద్ద ఈ అతి పెద్ద వజ్రాన్ని చూసేందుకు బ్యాంకు డైరెక్టర్లు గుమికూడారు. పెట్టె మూత తెరచి అందులో వున్న వజ్రాన్ని పైకి తీసిన డైరెక్టర్లు తమ చేతిలో వున్న వస్తువును చూసి ఒక్కసారిగా నిశ్చేష్టులయ్యారు. పెట్టిలో వజ్రం ఏమైందని అందరూ ఆదుర్దా పడ్డారు. అయితే వజ్రం లండన్‌కు క్షేమంగానే చేరింది. దానిని ఒక హెర్రింగ్ చేప లోపల పెట్టి ఒక సాధారణ ఓడలో లండన్ తీసుకు వచ్చారు. తరువాత ఆ అతి పెద్ద వజ్రాన్ని 105 విడి ముక్కలు చేశారు. అందులో అతి పెద్దదైన 530 క్యారెట్ల వజ్రానికి కల్లినాన్ అని, స్టార్ ఆఫ్ ఆఫ్రికా అని పేరు పెట్టారు.

పొడవైన కోరలు గల వైపర్

అత్యంత విషతుల్యమైన పాముల్లో వైపర్‌ను ప్రధానంగా చెప్పుకోవచ్చు. పొడవైన కోరల ద్వారా ఇది గుర్తింపు పొందింది. వైపర్‌కు పై దవడ ముందుభాగాన పొడవైన రెండు కోర్ పన్నులుంటాయి. అవసరం లేనప్పుడు వీటిని వెనక్కు మడిచే సౌలభ్యముంది. వైపర్లలో మొత్తం 150 రకాలున్నాయి. యురేషియా, ఆఫ్రికాలలో ఇవి ఎక్కువగా కనిస్తాయి. పిట్ వైపర్ రకం పాముల్లో వలె వీటికి వేడిని గుర్తించడల కణాలు లేవు. ఈ పిట్ వైపర్ రకం పాములు యూరప్‌లోనూ, తూర్పు ఆసియాలోనూ భిన్నంగా వుంటాయి. ఇవి ఇంచుమించు 61 సెంమీ పొడవుంటాయి.



తెల్సా!

ప్రమాదకరమైన చేప 'టూత్‌ఫిష్'

దక్షిణ అమెరికా జలాల్లో పిరాన్హా ప్రాంతంలో కన్పించే 'టూత్‌ఫిష్' రకం చేపలు చాలా ప్రమాదకరమైనవి. ఇవి వందలు వేల సంఖ్యలో తిరుగుతుంటాయి. త్రిభుజాకారంలో వుండే వీటి పళ్ళు చాలా పదునుగా వుంటాయి. ఇవి మూకుమ్మడిగా దాడి చేసి ఎంత పెద్ద జీవినైనా క్షణాల్లో అస్థిపంజరంగా మార్చేస్తాయి. 1976లో పిరాన్హా ప్రాంతం వద్ద సముద్రంలో కలిసే ఉరుబా నదిలోకి ఒక బస్సు దొర్లి పడింది. వెంటనే రక్షణ బృందం రంగంలో దిగి బస్సును నది నుండి వెలుపలికి తీసింది. అయితే టూత్‌ఫిష్‌ల మూలంగా బస్సులోని 38 మంది ప్రయాణీకుల అస్థిపంజరాలు మాత్రమే మిగిలాయి.



రంగుల సముద్రాలు

భూమండలం మీద కొన్ని సముద్రాలను రంగుల పేర్లతో పిలుస్తున్నారు. వాటికాపేర్లు ఎలా వచ్చాయో చూద్దాం. నల్ల సముద్రాన్ని రోమన్లు వారి భాషలో పొంటాస్ యాక్సెనస్ అని పిలుచుకుంటారు. స్నేహపూర్వక సముద్రమని దానర్థం. అయితే శీతాకాలంలో ఈ సముద్రంపై దట్టమైన పొగమంచు ఏర్పడ్డం మూలంగా ఆ సముద్రంలోని నీరు నల్లగా కన్పిస్తుంది. అందుకే దానికి నల్లసముద్రం అని పేరు వచ్చింది. అలాగే ఈశాన్య ఆఫ్రికా, అరేబియా ద్వీప కల్పాల మధ్య హిందూ మహాసముద్రం ఒక పొడవైన చేయి ఆకారంలో పొడుచుకు వచ్చినట్లుంటుంది. దీనికి ఎర్రసముద్రమని పేరు. దానికా పేరు ఎలా వచ్చిందనేది ఎవరికీ తెలియదు. అయితే



వేసవికాలంలో ఈ సముద్రం ఉపరితలంపై ఎరుపు రంగులో నాచు పేరుకొని ఉంటుందని, దాని వల్లనే ఈ సముద్రానికా పేరు వచ్చిందని ఒక కథనం ప్రచారంలో వుంది. అలాగే ఆర్కిటిక్ మహాసముద్రానికి తెల్ల సముద్రమనే ఒక శాఖ ఉంది. సెప్టెంబర్ నుండి జూన్ మాసం వరకు ఈ సముద్రం గడ్డకట్టుకుపోతుండడం వల్ల ఈ సముద్రానికి తెల్ల సముద్రమని పేరు వచ్చింది. కొరియా, చైనాల మధ్యలో పసిఫిక్ మహాసముద్రపు శాఖ పచ్చ సముద్రం ఉంది. ఈ సముద్రంలోకి హుయాంగ్ నది నుండి పెద్ద మొత్తంలో పసుపు రంగులో వుండే బురద వచ్చి చేరుతుండంతో దీనికి పచ్చసముద్రమనే పేరు సార్థకమైంది. ★

కూర

బీర్బల్ కథలు



ఎలా?

హాలో ఫ్రెండ్స్... పైన బోలెడన్ని అంకెలు, గుర్తులు వున్నాయికదా. వాటిని = ఉపయోగించి చెప్పండి

కార్టూన్



1724వ సంవత్సరంలో ఆక్సిజన్‌ను కనుగొన్నారు కద
మరి అంతకుముందు ప్రజలు ఎలా గాలిని పీల్చేవారో

ఆ ఒక్కరు ఎవరు?

హాయ్ బుజ్జాయిలూ...శాంతా క్లజ్‌లందరూ ఒకేలా ఉన్నారు కదూ. కానీ ఒక్కరు మాత్రం మిగతా వాళ్లలో కలవకుండా వేరేగా ఉంటారు. ఆ ఒక్క శాంతా క్లజ్ ఎవరో కనిపెట్టి సున్నా చుట్టండి.

జవాబులు

ఏంటబ్బా అది?..: గిఫ్ట్ బాక్స్

ఆ ఒక్కరు ఎవరు ?: బి

సుడోకు :

ఎలా? :

48=93-25-58+38



బాలనేస్తాలు

సుడోకు చేద్దామా...

హాలో బుజ్జాయిలూ...మీరు లెక్కలు బాగా చేస్తారు కదా. కిందున్న సుడోకు పజిల్‌ను చకచకా చేయండి. మీరు ఏంచేయాలంటే దానిలో నిలువుగా, అడ్డంగా గడులున్నాయిగా. వాటిలో 1 నుండి 6 వరకు అంకెలు వేయండి . అయితే ప్రతి వరుసలోనూ ఒక అంకెను ఒక సారి మాత్రమే వాడాలి. తర్వాత మా జవాబుతో సరి చూసుకోండే.

		1	6		
6					1
	1			6	
	5			3	
4					5
		5	4		

చుక్కలు కలిపేద్దాం

ఏంటబ్బా అది!

హాలో బుజ్జాయిలూ...కింద రెండు బాక్సుల్లోనూ ఒకే రకం బొమ్మలున్నాయి. అయితే ఒక బొమ్మ మాత్రం ఒక బాక్సులోనే ఉంది. అది ఏది?





MÉXICO
PUEBLA
MÚSICA
BAILES
PIÑATA
MARACAS
BURRITO
COMIDA
FIESTA
GLOBOS
ROJO
VERDE
BLANCO
RISA

N	S	O	B	O	L	G	G	D	J
Ó	M	L	U	Á	H	J	F	Í	É
F	M	A	R	A	C	A	S	Ú	B
F	D	L	R	I	S	A	N	K	L
H	F	B	I	V	E	R	D	E	A
X	F	E	T	A	L	Z	H	K	N
P	I	U	O	C	I	X	É	M	C
B	E	P	Y	I	A	R	O	J	O
Ú	S	C	O	S	B	R	H	S	Ñ
W	T	L	Q	Ú	Ñ	H	B	Ú	O
M	A	D	I	M	O	C	C	Ñ	H
Q	D	O	F	P	I	Ñ	A	T	A

కనిపెడదాం

నేస్తాలూ ! ఇక్కడ బోలెడు అక్షరాలు ఉన్నాయిగా. వాటి పక్కనే కొన్ని పదాలు కూడా ఉన్నాయి. మరి ఆపదాలు ఈ అక్షర సమూహంలో ఎక్కడ ఉన్నాయో వెతికి సున్నా చుట్టండి. అయితే అవి అడ్డంగా, నిలువుగా ఎలాగైనా ఉండొచ్చు. మరి రెడీనా.

అట్టమీది కథ

అడ్మిషన్లు... అగచాట్లు

ఇంకా స్కూళ్ళలో పరీక్షలు పూర్తవ్వలేదు. వేసవి సెలవలు ఇవ్వలేదు. అయినా స్కూళ్లలో అడ్మిషన్ల హడావిడి ప్రారంభమైంది. ప్రారంభమే కాదు, చాలా వరకూ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తికూడా అయిపోయింది! అప్పుడేనా అని ఆశ్చర్యపోయే వాళ్లు వెనకబడినట్టే లెక్క!!

- డా॥కాకర్లమూడి విజయ్

'విద్య' సంగతి పక్కన బెడితే చిన్నారులను స్కూళ్లకి పంపడంలో మాత్రం దాదాపు అన్ని కుటుంబాల్లో ఒకే విధంగా ఉంటుంది. పిల్లల్ని బడిలో చేర్పించకపోవడం మనలో చాలామందికి జీర్ణం కాని ఆలోచన; అసలు ఊహించలేనిది కూడా. ఆర్థికంగా సమస్యల్లో ఉన్న వాళ్లు కూడా తమ పిల్లలు స్కూలుకు వెళ్లాలని ఆశిస్తారు. అందుకు ప్రయత్నాలూ చేస్తారు. ఒక్కసారి 'మంచి' స్కూల్లో అడ్మిషన్ దొరికిందంటే గొప్ప విజయంలా భావించడం మనకు పరిచయమైన భావోద్వేగమే. ఫలానా స్కూల్లో పిల్లలు ఏం నేర్చుకుంటున్నారో, ఎలా అభివృద్ధి పొందుతున్నారో... అవన్నీ అనవసరం. అదీ మన జీవితాల్లో 'స్కూలు'కుండే విలువ.

వింత తంతు

అయితే స్కూలు అడ్మిషన్లు ఏటా జరిగే వింత తంతు. ఒక పక్క ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు లేక టీచర్లే ఇబ్బంది పడుతుంటే, మరో పక్క నగరంలో స్కూళ్లు అడ్మిషన్లివ్వక తల్లి దండ్రుల్ని ఇబ్బంది పెడుతున్నాయి. ఏ ప్రాతిపదికపై స్కూళ్లను ఎంపిక చేసుకుంటారో తెలుసుకుంటే కొన్ని ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూస్తాయి. మా పిల్లల్ని 'మిషనరీ' స్కూళ్లలోనే చేర్పించాలని కొందరంటే కొందరు కాన్వెంటనీ, ఇంకొందరు కాన్సెప్టనీ మరికొందరు పబ్లిక్ స్కూళ్లనీ అంటుంటారు. ఒక 'మిషనరీ' స్కూళ్లు తప్ప మిగతావేవీ తమ పేర్లకీ తాము చెప్పే విద్యా విధానానికీ పొంతన లేకుండా వుంటాయి. మిషనరీ స్కూళ్లు కూడా (ఒకప్పుడు క్రైస్తవ మిషనరీలు స్థాపించినవి) విద్యాబోధనలో మిగతావాటికి భిన్నంగా వుండక పోవడం విశేషం. ఇక కాన్సెప్టు స్కూళ్లు గానీ, పబ్లిక్ స్కూళ్లు గానీ వాటి వాటి ప్రాచుర్యం వల్ల కొద్దిమందికే అందుబాటులో వుండే స్థాయికి ఎదిగాయి.

బహు కష్టం

స్కూలు అడ్మిషన్లు ఎంత క్లిష్టమైనవో అనుభవం వున్న వారికే తెలుస్తుంది. సాధారణంగా స్కూళ్లు -కాస్త పెద్దవీ, మంచివీ, ప్రాచుర్యం పొందినవీ -నవంబరు, డిసెంబరు నెలల్లోనే అడ్మిషన్ల కార్యక్రమం మొదలెడతాయి. ఈ సంగతి చాలామందికి తెలియనే తెలియదు. "మా అబ్బాయి అడ్మిషన్ కోసం పక్కింటి వాళ్ల పిల్లల స్కూలు ఆటో అతనిని బతిమాలి, అడ్మిషన్ ఫారాలు ఎప్పుడిస్తారో కనుక్కోవలసి వచ్చింది" అని చెప్పాడు శ్రీనాథ్. తీరా ఆ రోజేదో తెలిశాక, వెళ్లడానికి వీలుకాక మరుసటి రోజు వెళ్తే అప్లికేషన్ ఫారాలు అయిపోయాయట. ఇంతకీ శ్రీనాథ్ వాళ్లబ్బాయి వయసు ఎంతంటే... మూడేళ్లు! ఆ పిడుగు చేరవలసింది ఎల్‌కెజీలో! ఇంత చిన్న వయసులో స్కూల్లో చేర్పించడానికి ఇంత కష్టమా అని అడిగే వారికి మరిన్ని విశేషాలున్నాయి. అడ్మిషన్ ఫారం దొరికిన వనజకి ఒక పేరున్న స్కూల్లో చేదు అనుభవమే ఎదురైంది. "అడ్మిషన్ కోసం ఇంటర్వ్యూ అనీ, దానికి మా పాపతో సహా మేమిద్దరమూ హాజరవ్వాలని ఉత్తరం పంపారు. మావారు ఆఫీసుకి సెలవు పెట్టి స్కూలు వాళ్లిచ్చిన సమయానికి వెళ్తే అక్కడ చాంతాడంత లైనుంది. ఉదయం తొమ్మిది గంటలన్న వారు మధ్యాహ్నం ఒంటిగంటకు పిలిచారు. తీరా లోపలికి వెళ్కాక కనీసం కూర్చోమని కూడా అనలేదు. ఇంటర్వ్యూ పేరుతో మా పేర్లూ ఉద్యోగ వివరాలూ తెలుసుకున్నారు. 'ఫీజు కట్టగలరా?' అని అడిగారు. 'ఎంతవుతుంది?'

అని అడిగితే ఆ వివరాలు అడ్మిషన్ దొరికాక చెబుతామన్నారు. ఇంతకీ మా పాపని అడిగిన ప్రశ్న: "వాటీజ్ యువర్ నేమ్?" ఇంట్లో కొన్ని రోజులపాటు తర్ఫీదు ఇచ్చినా, వాళ్లను చూసిన మూడేళ్ల పాప ఏడ్చేసింది. "ఇంటర్వ్యూకి ప్రిపేర్ చేసి తీసుకురాలేని వాళ్లు రేపు చదువెలా చూసుకుంటారు? కాబట్టి అడ్మిషన్ ఇవ్వము పొమ్మన్నారు" అంటూ వాపోయింది వనజ. ఈ తరహా అనుభవం చాలామందికి ఎదురై వుండొచ్చు. సాధారణంగా రెండున్నర సంవత్సరాల నుండి మూడున్నర సంవత్సారాల పిల్లలకు అడ్మిషన్ ఇంటర్వ్యూల తంతు నిర్వహిస్తుంటారు. నర్సరీ తరగతులకోసం ఈ అడ్మిషన్లు ఆ ఇంటర్వ్యూల కోసం తల్లిదండ్రులు పడే పాట్లు చూడాలి. రోజూ ఇంగ్లీషులో 'నీ పేరేంటి? అమ్మ పేరు, నాన్న పేరు, రంగులు, పండ్లు వగైరాల పేర్లు వంటివి నేర్పించడానికి కష్టపడుతుంటారు. అంత నేర్పించినా అడ్మిషన్ సమయంలో అయ్యేఎస్ ఇంటర్వ్యూ అంత బెరుకుగానే వుంటారు. ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో హెచ్ఆర్ఎమ్ గా పనిచేస్తున్న కమల్‌కి తన పిల్లాణ్ణి అబిడ్స్‌లోని ఒక పేరొందిన స్కూల్లో చేర్పించడానికి వెళ్లిన అనుభవం నవ్వు తెప్పిస్తుంది. "ఇంట్లో ఏమో డాడీ పేరేంటీ, మమ్మీ పేరేంటి? అని నేర్పించాం. తీరా అక్కడికెళ్లేసరికి 'వాటీజ్ యువర్ ఫాదర్స్ నేమ్?' అని అడిగారు. వాడికేమో ఫాదర్, మదర్, అని నేర్పించలేదు కదా– బిక్కమొహం వేశాడు. మా ఆవిడ వాడి *చెవుల్లో 'డాడీ పేరు' అని గుసగుసలాడుతోంది. ఆ ఇంటర్వ్యూ తీసుకునే వ్యక్తి* 'షూ' అని మా ఆవిణ్ణి మందలించాడు. మావాడు భోరు మన్నాడు. సీటు రాలేదు. నాకు మాత్రం నవ్వొచ్చింది' అంటూ ఆగి, 'ఇప్పుడు మా ఇంటి దగ్గరే వున్న చిన్న స్కూల్లో చేర్పించాం. మరో సంవత్సరం తరువాత పెద్ద స్కూల్లో వేయాలి" అన్నాడు కమల్.

పెద్దలకూ ఇంటర్వ్యూ

అడ్మిషన్ ఇంటర్వ్యూలు పిల్లలకే అనుకుంటే పొరపాటే. అవి చాలావరకు పెద్దలకులాగే వుంటాయి. వాళ్ల ముఖ్యోద్దేశం పిల్లల ఫీజులు కట్టగలరా లేదా తెలుసుకోవడమే! కూకట్ పల్లిలో వుంటున్న శ్రీనివాసరాజు అనుభవం చూడండి:

ప్ర: మీరేం చేస్తున్నారు?

జ: కాంట్రాక్టర్ నండి.

ప్ర: అయితే ఫీజు రెగ్యులర్‌గా కట్టగలరా?

జ: కడతామండి.

ప్ర: మీరేం చేస్తున్నారు (భార్యని ఉద్దేశించి)?

జ: హౌజ్‌వైఫండి.



ప్ర: ఏం చదువుకున్నారు?

జ: (ఇబ్బందిగా...) ఇంటరండీ.

ప్ర: మీరేం చదివారు (భర్త నుద్దేశించి)?

జ: డిగ్రీ

ప్ర: మరి ఆయన బయట తిరుగుతుంటే మీరు పిల్లలకి చదువు చెప్పగలరా?

జ: చెబుతానండీ.

ప్ర: ఇంటర్ చదివిన మీరు ఈ సిలబస్ అర్థం చేసుకోలేరు. ట్యూషన్లు పెట్టించగలరా?

....

....

మంచిదని చెప్పి వచ్చేసిన మూడురోజులకి స్కూల్లో అడ్మిషను దొరికిందని సందేశం వచ్చింది. "సంతోషంగా వెళ్లా. అక్కడికెళ్లాక, పాతికవేలు డొనేషన్ కట్టమన్నారు" చెప్పాడు శ్రీనివాసరాజు. 'ఇంట్లో మేమే చదువు చెప్పుకుంటూ, ట్యూషన్లూ పెట్టిస్తే ఇక స్కూల్లో వాళ్లేం నేర్పుతున్నట్టు? పైగా దానికోసం పాతికవేల లంచం!" అంటూ విసుగును వ్యక్తం చేసిన శ్రీనివాసరాజు పదివేల డొనేషన్ కట్టి మరో స్కూల్లో ఆయన పిల్లవాణ్ణి చేర్పించాడు. ట్యూషన్ మాత్రం "ఇంకా" పెట్టించలేదట.

పాకెట్‌ను బట్టే సీటు

స్కూళ్లలో అడ్మిషన్‌కీ, ఇంటర్వ్యూలకూ ఏ మాత్రం పొంతన లేదు. తల్లిదండ్రుల ఆర్థికస్థోమత, సామాజిక హోదా, విద్యార్హతలూ వంటివి తెలిస్తే పిల్లల్లో క్రమశిక్షణా, తెలివితేటలూ, ఫీజు కట్టే నిబద్ధతా అర్థమవుతాయి. అయితే కేవలం వాటి మీదే స్కూళ్లలో ప్రవేశం వీలౌతుంది. అంటే చదువుకోని తల్లిదండ్రుల పిల్లలు మాటేమిటి? ఆర్థికంగా బలహీనులుగా వున్న వారి





సంగతేంటి? "అన్ని స్కూళ్లూ ఒకేలా వుండవు. కొంతమంది ఇవేవీ పట్టించుకోకుండా అడ్మిషన్లు ఇస్తున్నారు" అని చెప్పాడు కృష్ణ కిషోర్. ఆయన మూడు స్కూళ్లు తిరిగి, విసిగి అంతగా పేరు లేని స్కూల్లో చేర్పించాడు. "రేండేళ్ల తరువాత ఇంకో స్కూల్లో చేర్పించవచ్చు" అంటున్నాడు.

ఎట్టకేలకు సీటు దొరికినా...

"స్కూలు వ్యవహారం చాలాసార్లు ఇబ్బందికరమైనదే. ఏదో మంచి స్కూలని దూరంగా వున్న స్కూలుని ఎంచుకుంటాం. ఒకవేళ అడ్మిషన్ దొరికినా ఆ తరువాత రోజువారీ కష్టాలు పగవాడిక్కూడా వద్దు బాబూ" అనే లెవెల్లో వుంటాయి. అంటూ నవ్వారు సుశీల. వాళ్ల పాపలిద్దరూ రోజరీ కాన్వెంట్లో ఎల్‌కెజీ, యుకెజీ చదువుతున్నారు. "వాళ్ల కోసం రోజూ ఆటో... వాళ్లొచ్చేవరకూ కంగారు... ఆటో రాని రోజు చూడాలి. మా యాతన" అంటారావిడ నీరసంగా.

మరి ఇంత కష్టపడి అంతంత దూరాలు, ఖర్చు భరించాల్సిన అవసరమేముంది? "మంచి స్కూల్లో వేస్తే కాస్త మంచి పద్ధతి వస్తుందని అంతే. చదువెలాగూ ఇంట్లో చెప్పించాల్సిందే" అంటారు సుశీల. మంచి స్కూల్లో చదివితే మంచి పేరు. అదో గొప్ప. మార్కులు తక్కువొచ్చాయని స్కూల్లో నుండి తీసేస్తామన్నారు. నేనూ మా మిసెసూ వెళ్లి బతిమలాడుకొని, ట్యూషన్ పెట్టిస్తామని నచ్చజెప్పి ఒప్పించాల్సి వచ్చింది" అంటాడు మూడవ తరగతి చదువుతున్న పిల్లాడి తండ్రి సురేష్. "ఇప్పుడు స్కూలు ఫీజంత ట్యూషన్ ఫీజు కడ్తున్నా? అడ్మిషన్లప్పుడు స్కూళ్లు చేసే హడావుడికీ, తరువాత వాళ్లు చెప్పే చదువుకీ ఏ మాత్రం సంబంధం వుండదన్నది సత్యం. అందుకు కారణమూ వుంది. అడ్మిషన్ల సందడి అధిక స్టూడెంట్ల తాకిడిని తట్టుకోవడానికి. "అసలు ఆ మాత్రం రెగ్యులేషన్ లేకపోతే, వచ్చిన వాళ్లందరికీ సీట్లిచ్చుకుంటూ పోతే, మాకు డబ్బులొస్తాయిగానీ క్వాలిటీ దెబ్బతింటుంది. రేపు ఫెయిల్యూర్స్ ఎక్కువ వుంటే మళ్లీ అడ్మిషన్ల కోసం మేం వెతుక్కోవలసి వుంటుంది" అని చెప్పాడు ఒక కార్పొరేట్ స్కూల్ ప్రతినిధి. కాస్త పెద్ద తరగతులైతే ప్రవేశ పరీక్ష నిర్వహిస్తాం. కాని చిన్న తరగతులకు ఇంటర్వ్యూ తప్పదు" అంటాడాయన.

"ఇదంతా డబ్బు దండుకునే వ్యవహారం. లేని డిమాండు చూపించి, ఎక్కువ డొనేషన్లు లాగడానికే ఈ ఇంటర్వ్యూల గొడవ. పెద్ద స్కూల్లో చేర్పించాలన్న తల్లిదండ్రుల ఆశలను, వారి బలహీనతను సొమ్ము చేసుకుంటున్నారు. అడ్మిషన్ల టైంలో చూపించిన శ్రద్ధ పాఠాలు చెప్పడంలో చూపించరు. వాళ్ల చేతగాని తనానికి పిల్లలను ఫెయిల్ చెయ్యడం వారిలో భయాన్ని పెంపొందించడం వంటివి చేస్తున్నారు" అంటారు కృష్ణకిషోర్.

అవును తల్లిదండ్రుల్లో అవగాహన పెరగాలి. దానితో పాటు కొన్ని అభిప్రాయాలు మారాలి. స్కూళ్లలో దాదాపు ఏడెనిమిది గంటలపాటు చిన్నారులను బందీ చేస్తున్నారు. అన్ని గంటలూ 'చదువు' ఉండకపోవచ్చు కానీ వేలకు వేలు పోసి కొన్న సీటు చేసేది ఇకటే. పిల్లల్ని కొన్ని గంటలు తమ వద్ద వుంచుకోవడం. అయితే 'మంచి' పిల్లలు వచ్చే అవకాశంతో పాటు మంచి సౌకర్యాలూ, 'మంచి' టీచర్లూ వుండే అవకాశమూ వుంటుంది. కాబట్టి పిల్లలు అటువంటి స్కూళ్లలో మంచి గా పెరిగే అవకాశముంటుంది". సుశీల గారి మాటల్లో "పునాది గట్టిగా వుంటుంది".

కానీ అన్ని పెద్ద పేరున్న, ప్రాచుర్యం పొందిన (ప్రచారం గట్టిగా కల్పిస్తే వచ్చిన ప్రాచుర్యం) స్కూళ్లలోను గట్టి పునాదిని ఆశించలేం.

మంచి స్కూల్లో మంచి జరిగేనా!

కాన్వెంటు స్కూళ్లు, పబ్లిక్ స్కూళ్లు, ప్రైవేట్ స్కూళ్లు, కార్పొరేట్ స్కూళ్లు, ప్రభుత్వ స్కూళ్లు ... ఏవైనా సరే పిల్లలకి పుస్తక విద్య, నడవడిక వంటి విషయాలను నేర్పాలి. నిజానికి అన్నీ చేసేది అదే. కానీ ఒక్కో దాంట్లో ఒక్కో పద్ధతి. ఒక్కో స్థాయి. కేవలం మంచి స్కూలుకెళ్లినంత మాత్రాన కచ్చితంగా మంచి జరగాలనే నియమం లేదు, భరోసా లేదు. అలా జరగడానికి ఎన్నో అంశాలు కీలకమౌతాయి. కాబట్టి స్కూళ్లను ఎంచుకునే విషయంలో తల్లిదండ్రులు కాస్త జాగ్రత్త వహించడం అవసరం. వీలూ, స్థోమతా, వెసులుబాటూ వుంటే ఏసీ స్కూళ్లలో చేర్పించుకోవచ్చు. కానీ మధ్యతరగతి మానవులకు మాత్రం మధ్యతరగతి స్కూళ్లు మంచివి. అనవసరంగా డొనేషన్లు ఇచ్చి మరీ చదివించనవసరం లేదు. చిన్న పిల్లల్ని మనం కాస్త ఇంటిదగ్గర శ్రద్ధగా నేర్పిస్తే ఎక్కడ చదివినా మెరుగు పడతారు. ఆటోలూ, బస్సులూ దూరాల సమస్యలు లేకుండా ఇంటికి దగ్గరగా వున్న స్కూళ్లు సౌకర్యంగా వుంటాయి. ఖర్చు తగ్గిస్తాయి. చిన్న స్కూళ్లలో టీచర్లతో 'చర్చించ' వచ్చు. పెద్ద స్కూళ్లలో ఆ అవకాశం వుండదు.

జర జాగ్రత్త

అయినా సరే, దూరపు కొండలు నునుపన్న సామెత లాగా మనకి దగ్గరి స్కూళ్లు ఆనవు -అష్టకష్టాలొచ్చినా అమెరికా ఉద్యోగమే మిన్న అన్నట్టుగా! పిల్లలకు సౌకర్యాలు సక్రమంగా వున్న స్కూళ్లు -మంచి వసతి, బెంచీలు వంటివి -మినహాయించి, తొలితరగతులకు అన్ని స్కూళ్లూ ఒకటే. కాకపోతే ఒకసారి స్కూలు మార్పించాలంటే అదో తంతు కాబట్టి ముందే జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయించడం మంచిది.

మరి ఇంకా మీ మూడేళ్ల చిన్నారిని స్కూల్లో చేర్పించలేదా? త్వరగా కానీయండి సీట్లు దొరక్కపోవచ్చు!! ★



మైదాతో కోవా పూరీలు

కావలసిన పదార్థాలు

పాలు - నాలుగు కప్పులు
పంచదార - ఒక కప్పు
మైదా - రెండు కప్పులు
యాలకులపొడి - పావు స్పూన్
జీడిపప్పు - పావుకప్పు
నెయ్యి - అరకప్పు

తయారు చేసేవిధానం

ముందుగా పాలను ఒక మందపాటి గిన్నెలో పోసి కలుపుతూ సన్న సెగపై మరిగించాలి. దీనిలో పంచదార వేసి కలుపుతూ వుండాలి. కోవా మాదిరిగా దగ్గరగా అయ్యాక యాలకుల పొడివేసి దించుకోవాలి. దీనిని వేరే గిన్నెలోకి తీసుకుని చల్లారనివ్వాలి. మైదాపిండిలో నీరు పోసి పూరీపిండిలా కలుపుకోవాలి. తరువాత చిన్న ముద్దలుగా తీసుకుని అప్పులా చేయాలి. ఇందులో ఇందాకటి కోవా ముద్దను పెట్టి ఒక ప్లాస్టిక్ కవర్‌పై నెయ్యి రాసి అప్పులా చేసి నూనెలో వేసి వేయించి తీయాలి. అంతే కోవాపూరీలు రెడీ.

బీరకాయ బజ్జీలు

కావలసినవి

బీరకాయలు - 2 లేతవి
శనగపిండి - పావుకేజీ
బియ్యంపిండి - 1 పెద్ద చెంచా
నూనె - వేయించడానికి సరిపడా
తినే సోడా - చిటికెడు
ఉప్పు - తగినంత
కారం - తగినంత

తయారుచేసే విధానం

చెక్కుతీసిన బీరకాయల్ని చిప్స్‌లా గుండ్రంగా కోసుకోవాలి. శనగపిండిలో బియ్యంపిండి, తినేసోడా, ఉప్పు, కారం కలిపి బజ్జీల పిండిలా (మరీ గట్టిగా కాకుండా, మరీ పలుచగా కాకుండా) కలుపుకోవాలి. ఇరవై నిమిషాలపాటు పిండిని నాననివ్వాలి. గుండ్రంగా కోసుకున్న బీరకాయ ముక్కల్ని... కలుపుకుని ఉంచుకున్న పిండిలో ముంచి నూనె బాగా కాగాక అందులో వేసి దోరగా వేయించాలి. వేడి వేడి బీరకాయ బజ్జీలు చాలా రుచిగా ఉంటాయి.



వంకాయ పచ్చడి

కావలసినవి

వంకాయలు - 150 గ్రాములు
పచ్చిమిర్చి - 5, అల్లం - చిన్నముక్క, వెల్లుల్లి - 4 రెబ్బలు, పసుపు - చిటికెడు
చింతపండు - చిన్న నిమ్మకాయలో సగం,
ఉప్పు - తగినంత, నూనె - 10 గ్రాములు, కొత్తిమీర - సన్నగా తరిగినది కొంచెం, తాలింపు గింజలు - అరచెంచా

తయారు చేసే విధానం

వంకాయ పచ్చడికి మరీ లేత వంకాయలు అవసరం లేదు. ఒక మోస్తరు కాయల్ని ఎన్నుకోవచ్చు. పుచ్చులు లేకుండా చూసుకుని చిన్న చిన్న ముక్కలు కోసుకుని ఉప్పు నీళ్లలో (నీళ్లలో చిటికెడు ఉప్పు వేయాలి) వేసి ఉంచుకోవాలి. స్టవ్‌మీద బాండీ వుంచి నూనె పోసి, వంకాయ ముక్కలు, పచ్చిమిర్చి, వెల్లుల్లి, పసుపు వేసి ముక్కలు బాగా వేయించాలి. ముందుగా నానబెట్టి ఉంచిన చింతపండును గుజ్జులా పిసికి వుంచుకోవాలి. వేయించి వుంచుకున్న వంకాయ ముక్కల్ని మిక్సీలోగానీ, రోట్లోగాని వేసి, మరీ మెత్తగా కాకుండా రుబ్బుకోవాలి. స్టవ్‌మీద బాండీ వుంచి మిగిలిన నూనె పోసి తాలింపు గింజలు వేసి చింతపండు గుజ్జు పోసి కొద్దిగా ఉడకనివ్వాలి. రుబ్బి ఉంచుకున్న వంకాయ పచ్చడి అందులో వేసి కలిపి దింపేయాలి. పైన సన్నగా తరిగిన కొత్తిమీర చల్లుకుంటే సరి. ఇది అన్నంతో పాటు చపాతీల్లోకి, దోశల్లోకి చాలా బాగుంటుంది. వంకాయ పచ్చడితో గుమ్మడి వడియాలు తింటే ఆ రుచికి సాటి మరొకటి లేదు.



కావలసిన పదార్థాలు

దొండకాయ ముక్కలు - ఒక కప్పు, టామాటా ముక్కలు - అర కప్పు, కొత్తిమీర తరుగు - పావు కప్పు, పచ్చిమిర్చి - నాలుగు , ఎండుమిర్చి - రెండు , జీలకర్ర - ఒక స్పూన్, ఆవాలు - అరస్పూన్ , నూనె - వేయించడానికి
పసుపు - చిటికెడు, ఉప్పు - తగినంత

టామాటా దొండకాయ పచ్చడి

తయారు చేసే విధానం

దొండకాయ, టమాటా, పచ్చిమిర్చి ముక్కలను ఎండు మిర్చిని నూనెలో వేసి వేయించి మగ్గనివ్వాలి. ఆ తరువాత తీసి చల్లారనివ్వాలి. అదే మూకుట్లో నూనె వేసి పైన చెప్పిన పోపు సామాను, పసుపు వేసి దించుకోవాలి. ఇందాకటి ముక్కలను మిక్సీలో వేసి మరీ మెత్తగా కాకుండా మిక్సీ చేసుకోవాలి. దీనిని ఓ గిన్నెలోనికి తీసుకుని ఇందాకటి పోపును కలిపి కొత్తిమీర తరుగు వేయాలి.

(మిక్సీ వేసేటప్పుడు కొన్ని పచ్చి దొండకాయ ముక్కలను కలిపితే బావుంటుంది.)

- పి జ్యోతి, ఖమ్మం.

నిర్మలమ్మ....గొప్ప నటి.
హీరోయిన్‌గా...అక్కగా...తల్లిగా...బామ్మగా...
ఎన్నో వందల పాత్రలు పోషించింది.
వయసుకు మించిన పాత్రలే ఎక్కువగా
చేసింది. అది ఆకాశవాణి కావచ్చు....రంగస్థలం
కావచ్చు...సినీరంగం కావచ్చు! వేదిక ఏదైనా
ఆమెకు తెల్సింది ఒకటే. తనకు ఇచ్చిన పాత్రలో
లీనమైపోవడం... జీవించడం...ప్రేక్షకులను
మెప్పించడం. ఆ లక్షణమే ఆమెను వీక్షకుల
మది దోచుకునేలా చేసింది. ఇప్పుడు ఆమె
మనమధ్య లేకపోయినా .... చాలా ఏళ్ల క్రితం
భిన్న సందర్భాలలో తన మనసును పత్రికలవారి
ముందు విప్పింది. ఆ విస్పష్టమైన
మాటలు...అభిప్రాయాలు ఆమె మాటల్లోనే...

నిర్మలమ్మ స్వగతం

నేను నాటక రంగంలో బాగా కృషి చేస్తున్న రోజులు . 1950లో కాకినాడలో జరిగిన ఆంధ్ర నాటక కళా పరిషత్ పోటీలకు ఎన్. ఏ.టి సంస్థ తరపున శ్రీ గోకుల్ చంద్ 'కరువు రోజులు' నాటికనూ, శ్రీ బుచ్చిబాబు 'ఆత్మ వంచన' నాటకాన్ని ప్రదర్శించారు. ఆ పోటీలకు సుప్రసిద్ధ హిందీ నటుడు పృథ్వీరాజ్ కపూర్ ముఖ్య అతిథిగా వచ్చారు. ప్రతి ప్రదర్శననూ అత్యంత ఆసక్తికరంగా చూశారు.

అంత వరకూ నేను తెలుగు వారి ముందు నాటకాలు ప్రదర్శించాను. ఆరోజు పృథ్వీరాజ్ కపూర్ గారి సమక్షంలో నటించడమంటే నాకు బెరుకుగానే ఉంది. ఆయన మహా నటుడు. పైగా పృథ్వీ థియేటర్స్ పేరిట నాటక సమాజాన్ని నడుపుతూ, ఆంధ్రా లో కూడా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు.

'కరువు రోజులు' నాటిక ప్రదర్శన ప్రారంభమైంది. మా నాటకాన్ని ఆయన చూస్తున్నారు. ఆయన పక్కన ఉన్న తెలుగు వారు నాటకంలో సంభాషణలను ఇంగ్లీషులోకి తర్జుమా చేసి చెప్తున్నారు. కానీ నన్నేం విసిగించకు అన్నట్లు మందలించి నాటకాన్ని చాలా ఆసక్తికరంగా చూస్తున్నారు ఆయన. నేను రంగ స్థలంమీద నటిస్తున్నానన్నమాటే కానీ నా దృష్టంతా ఆయనమీదే వుంది. నాటిక పూర్తయింది. హమ్మయ్య అనుకుని నేను గ్రీన్‌రూంలోకెళ్లి మేకప్ తీసుకుంటున్నాను. అంతలో కాజా వెంకట్రామయ్యగారొచ్చి 'నిర్మలా! నిన్ను పృథ్వీరాజ్ గారు చూడాలనుకుంటున్నారు. రామ్మా!' అన్నారు. నేను వెనక్కి తిరిగే సరికి ఆజానుబాహులైన పృథ్వీరాజ్ కపూర్ మూడున్నర అంగుళాల ఎత్తున్న గుమ్మంలోంచి లోపలికి రాలేక బాధపడుతూ తలను, సగం దేహాన్ని లోపలికి దూర్చి 'వేరీజ్ దట్ డెడ్ బాడీ! ఐ వాంట్ టు కంగ్రాచ్యులేట్ హర్' అని అరుస్తున్నారు ('కరువు రోజులు' నాటికలో నా పాత్ర చచ్చిపోతుంది. చచ్చిన శరీరం స్టేజీ మీద ఉండగా కొంత నాటిక సాగుతుంది). నేనే వారి వద్దకు వెళ్లాను. నన్ను నా అవతారాన్ని, నా నటనను చూచి ఆయన ఏమంటారో అని భయపడుతుంటే ఆ మహా నటుడే నన్ను అభినందించడానికి వచ్చేసరికి ఆనందంతో పాదాభివందనం చేశాను. ఆయన ఆప్యాయంగా నన్ను లేవనెత్తారు. ఆనంద బాష్పాలతో ఉన్న నన్ను ఆశీర్వదించి, తాను కప్పుకున్న శాలువాను తీసి నాకు కప్పారు. "యు ఆర్ ఎ రియల్ ఆర్టిస్ట్. దేరార్ వెరీ ఫ్యూ ఆర్టిస్ట్స్ లైక్ యు ఇన్ ఇండియా?" అని అభినందించారు. నా ఆనందానికి అవధులు లేవు. రాజ్ కపూర్, ప్రేమ్‌నాథ్, షమ్మీకపూర్, శశికపూర్ వంటి మహ నటుల్ని రంగ స్థలంపై తీర్చి దిద్దిన ఆ మహానటుడే తానుగా నన్ను అభినందించడం నా జీవితంలో మర్చిపోలేని సంఘటన.

ఆ పరిషత్ లోనే మేము ప్రదర్శించిన 'ఆత్మ వంచన' నాటకంలో నాకు ఉత్తమ నటి బహుమతి లభించింది. బహుమతిని ఇచ్చేముందు, ఫలితాన్ని ప్రకటించగానే "వేరీజ్ దట్ డెడ్ బాడీ! వెల్ కం టుది డయాస్" అన్నారు. ప్రేక్షకుల కరతాళ ధ్వనుల మధ్య వేదిక మీదకు వెళ్లి, ఆ మహానటుని చేతుల మీదుగా బహుమతిని అందుకున్నాను.

ఎన్నో సందర్భాలలో, ఎందరో మహానుభావుల చేతులమీదుగా ఎన్నో బహుమతులు అందుకున్నాను. కానీ, పృథ్వీరాజ్ కపూర్ అందించిన బహుమతే బహుమతి. ఆ ఆనందమే ఆనందం.

హీరోయిన్ నుంచి

హీరోయిన్ అమ్మ... అమ్మమ్మ దాకా "నిర్మల"

సిన్నదాన్నో -. పెద్దదాన్నో - ముందు మీ అందరికి నా దీపావళి జేజేలు.

నేను సినిమా లోకానికొచ్చి దగ్గర దగ్గర 20 యేళ్లవ్వస్తోంది. యింతవరకు నా పరిచయం ఎక్కడా రాలేదు. ఇప్పుడెందుకండీ నా పరిచయం అని జీ.వీ.జీ గారితోనూ అన్నా. ఆయనింటే కదా-యిసిత్రమైన మనిషి.

చాణక్యగారు, సి.వి.ఆర్ ప్రసాద్ గారు నేను సిన్మాల్లోకి రావడానికి కారకులు. సారథి వారి "అంతా మనవాళ్లే" సిన్మాలో నన్ను యిరోయిన్‌గా పిలిపించేరు.

పల్లం నరసింహారావూ నేనూ యిరో

యిరోయిన్‌లన్నారు. మేం యిద్దరికిద్దరం కొత్తోళ్లం కనుక యిద్దరినీ పెడితే డబ్బులు రావేమోనని నిర్మాతకు కొందరు చెప్పడంతో పల్లం నరసింహారావును అట్టే వుంచేసి నన్ను తీసేశారు. అట్టాగే భరణీ వారి "చక్రపాణి", వాహినీ వారి "బంగారు పాప"లో నన్ను మంచి యేసాలకే పిలిపించారు. కానీ, నేను బక్కగా ఉన్నానని వొద్దు పొమ్మన్నారు. ఇక మద్రాసులో ఉండటానికి యిష్టంలేక మళ్లా బెజవాడ యెల్లి నాటకాలు ఆడుకోసాగా. అట్టా రెండేళ్లయ్యాక మా ఆయన జి.వి. కిష్టారావుగారికి "ఆడ పెత్తనం" సిత్రంలో ప్రొడక్షన్ మేనేజర్ ఉద్యోగం దొరికింది.

మళ్లా నేను అట్టా మద్రాసుకు రావలసొచ్చింది. నేనీడకు వచ్చానని తెలిసి సారథి వారే "ఎత్తుకు పై యెత్తు" సిత్రంలో పెరుమాళ్లయ్య పక్కన నాకో యేసం యిచ్చేరు. దాంట్లో మొట్ట మొదట నేనీ బాసే మాటాడేను. ఆ పిచ్చరైతే దెబ్బతింది గానీ, నా యేసానికి మంచి పేరే వొచ్చిందట. ఆ మాట రామకృష్ణ ప్రసాద్‌గారే సెప్పేరు. మళ్లా ఆళ్ల రెండో పిచ్చరు "భాగ్య దేవత"లో సావిత్రి గారికి, రాజ సులోచన గారికి అమ్మగా యెయ్యమన్నారు. నాకేమభ్యంతరం? యేశా. కానీ, ఆళ్లిద్దరికీ నన్ను అమ్మ అనలా. అక్క అన్నారంతా. ఇక నాకీ అమ్మ యేసాలు కూడా దక్కవేమోనని దిగాలు పడిపోయా. కానీ అట్టా కాలే.

"గుళ్లో పెళ్లి, భక్త రఘునాథ్, భార్యా భర్తలు, కుల గోత్రాలు" యీ సిన్మాలలోనూ అమ్మ యేశాలే ఇచ్చారు. ఇక నేను అమ్మగా తప్పితే పనికి రానని ఆనాడే అనుకున్నా.

కానీ అంతకంటే పెద్దమ్మ గా చూపించాడు "పొట్టి ప్లీడరు" లో పద్మనాభం.

యేదో యిట్టా యేశాలు - యేసిన యేసం చెడగొట్టానని మీఅందరితో అనిపించుకోకుండా కాలం యీడుస్తున్న సమయంలో జెమినీ వారు "మనుషులు మారాలి" సినిమా తీత్తాండారని , అందులో ఒక యేశం ఉందని, అందుకని నున్న స్టూడియోకి తీసుకు రమ్మన్నారని సి.సి.రెడ్డి గారొచ్చి పిలిచేరు. యెల్లా, ఆడ డైరెక్టరు మధుసూధనరావుగారు అడిగారు "ఒక అమ్మమ్మ వేషం ఉంది. వేస్తావా" అని. 'యే యేశమైనా *యేసేదేగా బాబూ, బతుకు తెరువు అదేగా?"* అన్నా. అంతకు ముందు ఆ యేసానికి శానామందిని చూశారట. ఆనక నన్ను పిలిపించారు మధుసూధనరావుగారే. నిర్మాత బాలన్ గారికి నా గురించి ఆయన హామీ యిచ్చేరు. యేవో ఆరి సహకారంతో నే జేసిందేదో మీరు సూసేశారుగా.

మీ అందరి అభిమానమే నన్నీ రోజున యింత నటిగా నిలబెట్టింది.... ఆ అభిమానాన్ని మనసులో పెట్టుకునే నాకొచ్చిన పెతి యేశాన్నీ చాలా జాగ్రత్తగా యే మాత్రమైనా మీకు నచ్చేరీతిలో ఉండడానికే ప్రయత్నం సేస్తా ఉండా.

మన క్రిష్ణ "దేవుడు చేసిన మనుషులు"లో యేశం ఉందన్నాడు. తల్లి యేశమేనా అని అడిగా. "అవునమ్మా, మా నిర్మలకూ, సత్యనారాయణకు తల్లివి" అన్నాడు. సరేలే... మళ్లీ అమ్మే కదా అనుకున్నా, యేశా.

అది సరేగాని, సత్తెనారాయణకు నేను కూడెట్టి, ఆనక తెడ్డెట్టి కొడతా ఉంటే మీరంతా యిరగబడి తెగ నవ్వారంట. నిజమేనా? నాకు తెలీక అడుగుతా గాని, అతన్ని నేను కొట్టినందుకు



ఆంధ్రరాష్ట్ర ప్రజానాట్యమండలి ఉత్సవాలకు హాజరైన హిందీ నటుడు పృధ్వీరాజ్‌కపూర్ (రాజ్‌కపూర్ తండ్రి) కూర్చున్నవారు - అట్లూరి పుండరీకాక్షయ్య, నటి సావిత్రి, నటి నిర్మలమ్మ

నిర్మలమ్మ అసలు పేరు రాజామణి

నిర్మలమ్మ నటించినంత కాలం జీవించాలనుకుంది. నటించలేననుకున్నప్పుడు మానుకోవాలనుకుంది. అలాగే చేసింది కూడా. ఆమె తనకు తాను గాత్రధారణ చేసుకోలేని సమయంలో నటన మానుకుంది. అయినా ఆమె నటిస్తే కాని సినిమాలు తీస్తామనే నిర్మాతలు కొందరున్నారు. అహం, ఏకస్వామ్యం, నిర్లక్ష్యం, సినీరంగంలోని మహిళానటుల పట్ల తక్కువ చూపు ఉన్న సినీపరిశ్రమలో ఒక క్యారెక్టర్ నటిగా నిర్మల సంపాదించుకున్న గౌరవాభిమానాలు ఆమె వ్యక్తిత్వంలోని గొప్పతనాన్ని రుజువుచేస్తాయి. 'గరుడ గర్వభంగం'(1943)తో మొదలుకుని చివరి సినిమా 'ప్రేమకు స్వాగతం' వరకు ఎనిమిది వందల చిత్రాల్లో ఆమె నటించిన పాత్రలన్నీ ఆమె కోసం సృష్టించినవే. రంగస్థల సినీనటిగా కన్న ముందు ఆమె ఏడేళ్లపాటు విజయవాడ ఆకాశవాణిలో కార్యక్రమాలు చేశారు. వందల నాటకాల్లో నటించారు. ఆమె రేడియో ఆర్టిస్టుగా గొప్ప పేరు తెచ్చుకున్నారు. ఆ కాలంలోని ఆమెకు చాలా మంది రేడియో అభిమానులు ఉండేవారు. ఒకసారి విశ్వనాథ సత్యనారాయణ, "వేయి పడగలు" నాటకంలో గిరిక పాత్ర వేశారు. స్వయంగా విశ్వనాథవారే ధర్మరాజు పాత్రను పోషించారు. గిరిక వేణుగోపాలస్వామిలో లీనమయ్యే సన్నివేశం వచ్చే సమయంలో రికార్డింగ్ అయ్యాక "పిచ్చి తల్లీ! నిన్ను తక్కువగా అంచనా వేశానురా" అంటూ విశ్వనాథవారు నిర్మలమ్మ తలపై చేయి ఉంచి ఆశీర్వదించారు. ఆమెకు సినిమాల్లో వయస్సుకు మించి తల్లిపాత్రలు రావడంతో పరిశ్రమలో నిలదొక్కుకోవడానికి రాజీ పడింది. కానీ వరుసగా అలాంటి పాత్రలే వచ్చాయి. 'భార్యాభర్తలు, గాంధీపుట్టిన దేశం, పేదరాసి పెద్దమ్మ, కర్పూరదీపం, మనుషులు మారాలి, పదహారేళ్ల వయస్సు, శివరంజని, బొట్టు కాటుక, యమగోల, మగమహారాజు, గ్యాంగ్‌లీడర్, శంకరాభరణం, స్వాతిముత్యం, దేవత, చిల్లరకొట్టు చిట్టెమ్మ, అగ్నిపూలు, శుభలేఖ, బాబాయి అబ్బాయి, మావిచిగురు, ఆ ఒక్కటి అడక్కు...' వంటి చిత్రాల్లో ఆమె నటన అనితరసాధ్యమైనది. విజయబాపినీడు, జంధ్యాల, దాసరి, రేలంగి నరసింహారావు వంటి దర్శకులు ఆమె లేకుండా సినిమాలే తీయలేదు. మయూరి, సీతారామరాజు చిత్రాలకు గాను ఆమె నంది అవార్డులు అందుకున్నారు. ఇంతకు ఆమె అసలు పేరు రాజామణి అని చాలా మందికి తెలియకపోవచ్చు. 1927 నవంబర్‌లో దీపావళి తరువాత సప్తమి రోజున పుట్టారు.

నవ్వేరా? లేక నేను కొట్టిన దానికి నా చేతులు నొప్పెట్టాయేమోనని అత్తనడిగినందుకు నవ్వేరా?

యెట్టా అయితే యేం లెండి. మిమ్మల్ని మొత్తానికి నవ్వించాం. మా కదే చాలు.

"గాంధీ పుట్టిన దేశం"లో శివయ్య యేశం కట్టిన కిష్టంరాజు - కిష్టంరాజు కాదు, నాకొడుకే అనుకుంటా సేసా. ఆ సిన్మాలో పెతి సీనూ ఆడ నిజంగానే జరిగినట్టుగానే నావొళ్లు పొంగి యేక్ట సేశా. నా శివయ్యకు యావజ్జీవ కారాగార శిచ్చ యేశారంటే నా సొంత కొడుకునే పోలీసోళ్లు తీసుకెళ్లి పోతున్నట్లుగా బాదపడి యేడ్చా. నా మనసు పుప్పొంగి సేసిందే కాని, నేను యాక్టు సేయలేదా సిన్మాలో. అట్టాగే నా కోడల్ని లాక్కొచ్చి రోడ్డుమీద పారేసినప్పుడు కూడా, నాసొంత కోడల్నే యెవరో అవమానం సేసి రోడ్డుమీద పారేసినట్టనిపించింది. ఆ కోడల్ని ఒక యేశం కాదు, ఆ యేశం కట్టింది లత అనిపించలేదు నాకు. అట్టాగే ఆ సినిమాలో పెతి సీనూ నేను నిజంగానే అనుకుంటూ చేశా. నా యేశం ఎంత వరకు మీరు మెచ్చారో?


'శంకరాభరణం'లో నిర్మలమ్మ, రాజ్యలక్ష్మి, చంద్రమోహన్

యిప్పుడు "మేమూ మనుషులమే, ఖైదీ బాబాయ్, కోడెనాగు, ప్రేమపెళ్లిళ్లు, మీనా, పసి హృదయాలు" సినిమల్లో యేస్తున్నా.

యెట్టాగైతేనేం, ఒకప్పుడు యీరోయిన్ యేశానికని వొచ్చినదాన్ని, యిప్పుడు అమ్మగా నిలబడ్డా, మీ అందరి అభిమానంతో. నాకిదే బావుండాది. నా ఆఖరి చ్చణం వరకు మీ అందరి అభిమానాన్ని పొందగలిగేటట్టే యేక్ట సేయడానికి ప్రయత్నం సేస్తా.

యిక ఉంటా

- మీ నిర్మల...

- హెచ్ రమేష్‌బాబు సౌజన్యంతో సినిమారంగం, విజయచిత్ర మాసపత్రికల నుండి

నీ ఇష్టం,,,

- జావెద్

నేన్నిన్ను ప్రేమిస్తున్నాను
కానీ... నువ్వూ నన్ను ప్రేమించాలని
మాత్రం కాదు.
నేన్నిన్ను ఇష్టపడుతున్నాను
కానీ... నీకిష్టం లేకపోయినా
నన్ను ఇష్టపడాలని మాత్రం కాదు.
నువ్వు నాకు నచ్చావన్నాను
కానీ... నీకు నచ్చకపోయినా
నన్ను మెచ్చుకోవాలని మాత్రం కాదు.
నువ్వంటే నాకు ప్రాణం అన్నాను
కానీ... నువ్వు కాదంటే
ప్రాణం తీద్దామని మాత్రం కాదు.
నువ్వొప్పుకుంటే జీవితం
పంచుకుంటానన్నాను
కానీ... ఒప్పుకోకపోతే
నీ జీవితం నాశనం చేయాలని
మాత్రం కాదు.
ప్రియా... ఇప్పుడైనా తెలిసిందా
నేన్నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నానో
అంతగా నీకోసం పరితపిస్తున్నాను
కూడా.
సందెవేళ సరిగమవై అరుదెంచుతావో
మమతల మధురిమవై మురిపిస్తావో
అడుగులో అడుగై కలిసొస్తావో
తోడూ నీడై కలిసుంటావో
ప్రేమిస్తావో, నిరాకరిస్తావో
అంతా నీ ఇష్టం.

కవిత్వమ్



శంభుక వధ

- కొత్తపల్లి నాగేందర్

అపచారం జరిగింది ఆచార్యుల వారు
శంబుకుడు మళ్లీ గొర్ల కాపరై పుట్టాడు
సెంట్రల్ వర్శిటీలో సిద్ధాంతాలు మధించాడు
అక్షర వనంలో విరై వికసించాడు
కోసుకు తినే గొర్రెంత దాని కాపరెంత
అగ్రజుల రాజ్యంలో అగ్రగామి అవుతాడా
ఎంత నామర్దా, అప్రదిష్ఠౌను సరస్వతికి
అందుకే తమరు చక్రం అడ్డు వేశారు
రాముడై బ్రహ్మాస్త్రం సంధించారు
విజ్ఞులైన తమరు అందుకే
విశ్వ విద్యాలయం పరువు కాశారు
విద్య మైలగాకుండా ఎంతో బరువు మోశారు
గణుతికెక్కిన తమ శిష్య గణం మాత్రం...
వానర సైన్యమై వామన మూర్తులై
గుడ్‌షెపర్డ్ బాలరాజును బలిచ్చారు
కాగల కార్యం నెరవేరినందున
కాస్త సంప్రోక్షణ చేసుకుంటే సరి
వాడు గొర్లు కాసి వాటిని కోసి
విందు భోజనమూ వడ్డించగలడు
ప్రతీకార వంటకాన్ని చల్లారాకా తినగలడు
అసలే 'సామాజిక న్యాయం'
నాలుగు పాదాలా నడుస్తున్న కాలం
గుడ్‌షెపర్డ్ బాలరాజు
పునరుజ్జీవించే ప్రమాదముంది
మనువు మళ్లీ పుట్టేదాకా
మీరు జాగ్రత వహించాలి సుమీ

(చదువుల పూదోటలో వాడని కుసుమం బాలరాజు)

క్రైమ్ కథ

తలుపు తెరిచిచూడు

- యర్నాగుల సుధాకరరావు

"**సార్** నన్ను ఎవడో అదేపనిగా ఫోన్‌చేసి వేధిస్తున్నాడు. ఇప్పుడు ఏకంగా పోస్టుకార్డుమీద రాశాడు. వాడిచేతిరాతతో వాడిని మనం పట్టుకోవచ్చు" అని కార్డు ఇచ్చాడు యాభైఏళ్ల గోపాలం.

పోలీస్‌స్టేషన్‌లో కూర్చున్న ఇన్‌స్పెక్టర్ కార్డును ఎగాదిగా చూసి "ఇందులో ఏముంది? ప్రతిరాత్రి పన్నెండు గంటలకు నీఇంటి తలుపు తెరిచిచూడు. అప్పుడు నీవు ఎన్నాళ్ల నుంచో ఎదురుచూస్తున్న దృశ్యం నీకు కన్పించి తీరుతుంది" అని రాశాడు. నాకైతే ఏమి అర్థంకాలేదు. నీకు ఏమి అర్థం అయిఏడ్చిందో"

"సార్ ముందు ఫింగర్ ప్రింటుకు పంపేయండి. అలాగే ఈఅక్షరాలు మీద మీవంతు పరిశోధిస్తే వాడెవడో తెలిసిపోతుంది" ఉత్సాహంగా చెప్పాడు.

"అనుమాన పిశాచం ఒకటి నిన్ను ఆక్రమించింది. నీవు మానసికంగా చాలా బలహీనంగా, సన్నగా, పీలగా ఉన్నావు. ముందు ఏమానసిక డాక్టర్‌నో కలుసుకుని ఆ తర్వాత ఇంకా నీకు పిచ్చి తగ్గకపోతే అప్పుడు వచ్చి తగలడు. నేరాలు రికార్డుల్లో పేరుకుపోయి మేము జుట్టు పీక్కుంటుంటే ఎవడో కౌన్‌కిస్కాగాడికోసం మేము మాపనులు మానుకుని దర్యాప్తు చేయాలా? పోవ-య్యా పో!"

అక్కడే ఉన్న రైటర్ "సార్ ఇతడు లోగడ చాలా సార్లు వచ్చాడు.ఇతడు మీరూహించినట్టే గొప్ప అను మానం. ఇంటిలో భార్యను కూతురుని అనుమానించి వారిని మానసికంగా హింసిస్తుంటాడు. ఇంటివైపు ఎవరు చూసినా ఆరాలు తీస్తాడు. ఇక కూతురు కాలేజికి వెళ్లి ఒక్కనిముషం లేటయినా కారణాలు చెప్తేగాని ఇంట్లోకి రానీయడు." చెప్పి గోపాలం వైపు హీనంగా చూశాడు.

గోపాలం వారివైపు గుర్రుగా చూసాడు."సార్ నాకంప్లయింట్ దర్యాప్తుచేస్తారా? లేకుంటే పైఅధికారుల వద్దకు వెళ్లి వారిచే చెప్పించనా?" సూటిగా అడిగాడు.

రైటర్ తెల్లకాగితం ఒకటి అందించి "నీవు రాయాల్సింది రాసివ్వు. నీతో ఎందుకు లేనిపోని వాగ్వివాదం. నువ్వు పైఅధికారులతో మాతో మాట్లాడినట్టుగా కాకుండా జాలిపడేలా మాట్లాడి మాపై ఒత్తిడి తెస్తావు. నీవు కోరినట్టే నిన్ను వేధించేవాడిని పట్టుకుని నీకు అప్పగించేస్తాం" చెప్పిపెద్దగా ఆవులించాడు. క్షణాల్లో రాయాల్సింది రాసేసి అందించేశాడు.

> **"ఆచంపింది ఎవరో కాదు. హతురాలు మంజరి భర్త రాజ్.వారిద్దరి మధ్య ఎప్పట్నించో డైవర్సు కేసు రన్‌అవుతోంది. ఆవిడకు ఆస్తులు ఇవ్వకుండా ఎగవేసేందుకు ఆమెను చంపేశాడు"**

"సార్ అందులో నా అడ్రస్ ఉంది. నాసెల్ నెంబర్ ఉంది.ప్రతిరోజు సాయంత్రమే నిద్రపోయి అలారం పెట్టుకుని పన్నెండుకు లేచిపోయి తలుపుతెరిచి వీధిలోకి అదేపనిగా తెల్లవార్లు చూస్తున్నాను. ఏమీ కన్పించదు. వాడెవ్వడో ఆకాశ రామన్నగాడు నన్ను ఎందుకు అలా చూడమన్నాడో తెలియదు. ఒకవేళ కాదని ధిక్కరిస్తే ఏదైనా జరగవచ్చు. నాఇంటిల్లిపాది హాయిగా నిద్రపోతుంటే నేను నిశాచరుడిలా అర్ధరాత్రినుంచి తలుపువద్దనే ఉంటున్నాను. ఆ టెన్షన్ నుంచి విముక్తికై నన్ను వేధించేవాడిని పట్టుకుంటే వాడే మీ లాఠీ దెబ్బలకు చెబుతాడు. నాకు ఈజాగరణలుండవు"అని ఏకరువు పెట్టాడు.

ఆమాటలకు ఇన్‌స్పెక్టర్ నొసలు నొక్కుకున్నాడు. గోపాలం వెళ్లిపోయాక రైటర్ నిట్టూర్చి "సార్ వీడిని ఎవడో ఆవీధిలో కుర్రవెధవ ఆటపట్టిస్తున్నాడు. నైట్‌బీట్‌లో ఉన్న కానిస్టేబుల్స్‌కు చెబుతాను.ఏదో విధంగా సాల్వ్ చేయాలి.లేకుంటే చాలా ప్రమాదం.వీడికి పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్ బాగానేఉంది. ఇక పైనుంచి ఒత్తిడి భరించలేం.వీడు ఈరోజు నుంచి ఉదయం సాయంత్రం అదేపనిగా నాకేసు ఏమయ్యింది అని ఫోన్‌లో చంపుతాడు. వీడిని అసలు భరించలేం. ఏం ఉద్యోగాలో ఏమిటో?" ఇన్‌స్పెక్టర్ నవ్వేశాడు. "చాలా చిత్రంగా ఉంది ఈమానసికరోగికథ"

నాలుగురోజులు గడిచిపోయాయి. అప్పటికి పదిపదిహేను సార్లు పోలీస్‌స్టేషన్‌కు గోపాలం ఫోన్లు చేసేశాడు. పోస్టుకార్డు రాసిన వెధవ దొరికాడా లేదా? ఎప్పుడు పట్టుకుంటారు ఇలా అయితే ఎలా? అని మరీ నిలదీస్తూనే ఉన్నాడు. రాణా రైటర్ ఓపిగ్గా అన్ని కోణాల్లో వెతికాం అని చెబుతున్నాడు. గోపాలం అలారం సరిగ్గా పన్నెండు గంటలకు మోగింది. నిద్రలోంచి లేచాడు. మెల్లగా వీధి తలుపు తీశాడు. వీధంతా నిర్మానుష్యంగా ఉంది. ఎవడో ఆగంతకుడు ఊరకనే రాయడు. ఏదో జరుగుతోంది.కొంపదీసి భార్యగాని కూతురుగాని కాని పనులు ఏమైనా చేస్తున్నారా?ఒకసారి చూస్తే పోలా? మెల్లగా మెట్లపైకి పిల్లిలా ఎక్కాడు. మేడమీద గదుల్లో భార్య, కూతురు గాఢనిద్రలో ఉన్నారు. ఈ ఖాదస్తం వారు భరించలేక అసలు పట్టించుకోకుండా వారి జీవనం వారు సాగిస్తున్నారు. గోపాలం అర్ధరాత్రినుంచి తెల్లవారే వరకు కనీసం పదిసార్లయినా వీధితలుపు తెరిచి బయటికి చూస్తూనే ఉన్నాడు. ఏరోజు ఏమీ కన్పించలేదు. అయినా పట్టువదలకుండా ప్రతిరాత్రి ఆపనిలో ఉన్నాడు. ఫ్లాస్కులోంచి వేడి టీ కప్పులో పోసుకుని తాగుతూ టైమ్ చూశాడు.రెండున్నర అవుతోంది.తలుపుతీసి చూద్దామని చూశాడు. అంతే ఎదురింట్లో ఒకామెను నోరు మూసేసి కత్తితో పొడుస్తున్నవాడిని చూశాడు. ఎవడా అని తన తలుపు సందులోంచి గుచ్చిగుచ్చి చూశాడు.ఎవరో కాదు.గోల్డుమర్చంటు రాజ్. చంపేసి శవాన్ని ఇంటిముందున్న మొక్కల్లోకి పడేసి చీకటిలోకి పారిపోయాడు. అదిచూసాక దారాెత్తిపోయాడు.

మరుసటిరోజు పోలీసులు వచ్చారు. అక్కడ పెడబొబ్బలు పెడుతూ తన భార్యను ఎవడో చంపేశాడని హంతకుడు రాజ్ చెబుతుంటే గోపాలం అవాక్కయ్యాడు. పోలీసులు అతడిమాటలు నమ్మినట్టు అతడికి ఓదార్చారు.

ఆసాయంత్రం గోపాలం పోలీసులకు ఫోన్‌చేసి నన్ను వేధించేవాడి సంగతి ఏమి చేశారని అడిగాడు. రాణా రైటర్‌కు కోపంతో బదులిచ్చాడు. "మీఎదురింట్లో ఒకామెను చంపినదెవరో తెలియక మేమంతా చస్తుంటే నీవేమిటయ్యా పనికిమాలిన కేసుకోసం ఆరాలు తీస్తావు. ఒకవారం పదిరోజుల వరకు ఫోన్‌చేయకు" అని విసురుగా ఫోన్‌పెట్టేశాడు. హత్యకు సంబంధించిన రిపోర్టు ఇన్‌స్పెక్టర్ ముందుకు వచ్చింది. హంతకుడికి సంబంధించిన వేలిముద్రలు, హత్యాయుధం దొరకలేదు. తల పట్టుకుని ఆలోచిస్తుండగా గోపాలం గుర్తుకువచ్చాడు. వెంటనే అతడిని పిలిపించాడు. వస్తూనే నన్ను వేధించినవాడిని పట్టుకుని చెమడాలు వొలిచారా? ఆత్రంగా అడిగాడు.

"వాడిని పట్టుకున్నాం. నీముందు పెడతాం. నువ్వు రాత్రి 12 తర్వాత మేల్కుని ఉంటావు. నీఇంటిముందు ఒకహత్య జరిగింది. నువ్వు కళ్లారాచూశావు. ఎవరు ఎందుకు చంపారు? నువ్వు చెబితే నిన్ను వేధించినవాడిని నేను చూపిస్తాను." చెప్పి కళ్లలోకి తీక్షణంగా చూశాడు ఇన్‌స్పెక్టర్.

గోపాలం తటపటాయించినా వేధించిన వాడి గురించి తెలుసుకోవాలని తను చూసింది చెప్పాడు. "ఆచంపింది ఎవరో కాదు. హతురాలు మంజరి భర్త రాజ్.వారిద్దరి మధ్య ఎప్పట్నించో డైవోర్సు కేసు నడుస్తోంది. ఆవిడకు ఆస్తులు ఇవ్వకుండా ఎగవేసేందుకు ఆమెను చంపేశాడు"

"నీకు ఉత్తరం రాసింది ఎవరోకాదు మంజరియే. నీకు ఫోన్ చేసింది ఆమె కాదు.నువ్వు అసలే మానసికరోగివి. చీటికిమాటికి తలుపు తెరిచిచూస్తు ఆమెకు కాపలా కుక్కలా ఎంతో రక్షణ ఇచ్చావు. అయినా రాజ్ అనుకున్నట్టే ఒంటరిగా ఉంటున్న ఆమెను చంపేసి నీకళ్లలో పడ్డాడు" అంటూ ఇన్‌స్పెక్టర్ నవ్వాడు. ★

కథ

ఆఖరి ఆకు





"చిత్రం! లోకంలో ఎక్కడైనా చెట్ల ఆకులు పోయుంటే వాటిలో తమ జీవితాన్ని సరిపోల్చుకునే వాళ్ళుంటారా? నేనైతే ఇప్పటి వరకు ఇటువంటి విషయం వినలేదు. నేన్నీకు మోడల్‌గా ఇక రాను; ఎందుకంటే - తనలా అవడానికి నువ్వే కారణం!"

ఆంగ్లమూలం: ఓ హెన్రీ (దిలాస్ట్ లీఫ్)

అనువాదం : అత్తివిల్లి బాలసుబ్రహ్మణ్యం

వాషింగ్టన్ నగర పశ్చిమాన గల చిన్న తాలూకా అది. దాని వీధులు కాస్త ఏహ్యంగా వున్నా, విశాలంగా వుంటాయి. ఇవి మరల అనేక విధాలుగా వంపులు తిరిగి వుంటాయి. ఒక వీధికి మరొక వీధికి సంబంధముండదు. ఒకప్పుడు చిత్రకారుడొకడు ఈ వీధులిట్లా వుండడంలోని ఔన్నత్యాన్ని పసిగట్టాడు. ఈ విధంగా అనేక వంపులు తిరిగి 'పద్మవ్యూహము' వలె వుండే పాంత్రానికి అద్దెలు వసూలు చేసే వ్యక్తి వస్తే -అతను తిరిగి తాను మొదట వచ్చిన ప్రదేశానికే, ఒక సెంట్ అయినా వసూలు చేయకుండా తిరిగి వస్తాడన్న మాట!

కాబట్టి -ఇట్లాంటి పాత గ్రీన్‌విచ్ గ్రామానికి చిత్రకారులెక్కువగా వచ్చి చేరేవారు. వారిలో 'షూ', 'జాన్సీ' అనే ఇద్దరు చిత్రకారిణులు మన ప్రస్తుత కథానాయికలు. ఒక మూడంతస్తులున్న చిన్న భవనంలో వీరిద్దరూ తమ స్టూడియో ఓపెన్ చేశారు. వీరిద్దరూ–ఒకరు 'మెయిన్' నుండి ఇంకొకరు 'కాలిఫోర్నియా' నుండి వచ్చి ఒక డిన్నర్ టేబుల్ దగ్గర పరిచయాలు చేసుకుని ఇద్దరి 'టేస్ట్'లు ఒకటే అవడంతో, 'జాయింట్ స్టూడియో' ప్రారంభించారు. ఇప్పుడు వీరిద్దరూ ఆప్తమిత్రులు మరి!

నవంబరు నెలలో ఆ కాలనీ అంతా–అక్కడా ఇక్కడా 'న్యుమోనియా' వ్యాపించింది. దురదృష్టవశాత్తూ జాన్సీకి కూడా ఆ వ్యాధి సోకింది. పరీక్ష చేసిన డాక్టర్- "ఈమె బతకడానికి నూటికి ఒకశాతమే అవకాశముంది" అన్నాడు. థర్మామీటర్‌ని నేలకు విదిలిస్తూ ఆ అవకాశమైనా ఆమెకి జీవితం మీద ఆశ, మమకారం కలిగినప్పుడు మాత్రమే లభిస్తుంది. ఈమె మనస్సులో 'తనింక బ్రతకననే ఊహ గాఢంగా వుంది. ఇదికాక, మరేదైనా కోరిక ఆమె మనస్సును పీడిస్తోందా?" అడిగాడు షూని.

"అదా–ఆమె ఏనాటికైనా 'బేఆఫ్ నేపిల్స్' చిత్రించాలనుకుంటోంది–"

"పెయింటింగా?"

"కాదు! వేరే ఏదైనా ఒకటికి రెండుసార్లు ఆలోచించేలా చేసేది ఆమె మనస్సులో వుందా! ఫరెగ్జాంపుల్, ఒక అబ్బాయి మీద ప్రేమ లాంటివి?"

"అబ్బాయా? అతని మీద ప్రేమా?! లేదు, డాక్టర్!" గద్గద స్వరంతో అన్నది షూ "అటువంటిదేం లేదు."

"మంచిది. అయితే బలహీనత అయుండొచ్చు" అన్నాడు డాక్టర్.

"నా శాయశక్తులా ఈమెనీ రోగంబారి నుండి కాపాడడానికి ప్రయత్నిస్తాను. నువ్వు మాత్రం, మైడియర్ షూ సాధ్యమైనంతగా ఆమెనుత్సాహ పరుస్తూ ఆమెకి జీవితం మీద ఆశ కలిగేలా ముఖ్యంగా ఆమె మనస్సులో ఏముందో తెలుసుకో! అప్పుడు జాన్సీ నూటికి యాభైవంతులు బ్రతుకుతుందని హామీ ఇవ్వగలుగుతాను".

డాక్టర్ వెళ్ళిపోయిన తర్వాత షూ తన డ్రాయింగ్ బోర్డ్‌తో పైఅంతస్థుకు చేరుకుంది. అక్కడ జాన్సీ నైటీతో –ఒక కిటికీ వంక ముఖం తిప్పి కూర్చొనుంది.

షూ తల పంకించి తన సరంజామా తీసుకుని, ఏదో చిత్రం పెయింట్ చేయడంలో నిమగ్నమయింది.అయితే కాసేపటికే జాన్సీ చిన్న స్వరంతో ఏదో మాట్లాడుతుండడం, గమనించి, తన పని ఆపి ఆమె మంచం వద్ద కెళ్ళింది.

జాన్సీ తన పెద్ద పెద్ద కళ్ళనింకా విశాలంగా చేస్తూ, ఏదో రివర్సులో లెక్క పెడ్తోంది!

"పన్నెండు - అన్నదామె "పదకొండు! పది! తొమ్మిది! ఎనిమిది తర్వాత కాసేపట్లోనే అన్నది–'ఏడు!"

షూ కిటికీలోంచి అవతలికి తొంగిచూసింది. ఒక పెద్ద పాత మర్రిచెట్టు తప్ప అక్కడికేమీ లేవు. ఆ చెట్టు కూడా బాగా ఎండిపోయి, శిధిలావస్థలో కాంపౌండ్ వాల్ సగం వరకు ఆనుకొని వుంది. "ఏమిటి నీవు లెక్కించేది, మైడియర్ ఫ్రెండ్" అడిగింది. షూ.

"ఆరు!" జాన్సీ విసుగ్గా పలికింది. "అవి వేగంగా రాలిపోతున్నాయి. మూడ్రోజుల క్రితం వందదాకా వున్నాయి. అప్పుడవి లెక్క పెట్టడానికే నాకు తలనొప్పి వచ్చింది. కాని ఇప్పుడు ఈ లెక్క చాలా సులభం! అదిగో మరొకటి రాలిపోతోంది! ఇప్పుడు ఐదు మాత్రమే మిగిలాయి."

"అయిదేమిటి, మైడియర్? దయచేసి నీ షూకి చెప్పు–"

ఆకులు –ఆ మర్రిచెట్టు ఆకులు! ఎప్పుడైతే ఆఖరిది కూడా రాలిపోతుందో, నేను కూడా అప్పుడే చచ్చిపోతాను. నాకా విషయం గత మూడ్రోజుల్నుండీ తెలుసునే! ఏం, నీకు డాక్టర్ చెప్పలేదా?!"

"నేనెప్పుడూ అటువంటి 'నాన్సెన్స్' వినలేదు–" అంది షూ. "ఆ పాత మర్రిచెట్టు ఆకుల పతనానికి, నీ ఆరోగ్యానికి సంబంధమేమిటి? 'పసిదాని'లా

మాట్లాడకు! నీకేం భయంలేదు. నువ్వు త్వరలోనే కోలుకుంటావని ఈరోజు డాక్టర్ చెప్పాడు. కొంచెం బ్రెడ్డూ, కాస్త డ్రింకూ తీసుకో, డియర్!'

"అవేవీ నువ్వు నాకు తేవద్దు!" చెప్పింది. జాన్సీ, తన చూపులు కిటికీ కేసి మరలిస్తూ. "అదిగో ఇంకోటి కూడా రాలిపోయింది. వద్దు నాకేవిధమైన ఆహారమూ వద్దు. ఆ ఆకులింక నాలుగే వున్నాయ్. చీకటి పడక ముందే చివరాకు పడడాన్ని చూడాలి నేను! ఆ తర్వాత ఎలాగూ నేనూ పోతాను. కదా!"

"నువ్వు కిందకే పోతావా?" కాస్సేపటి తర్వాత చిన్నగా అడిగింది జాన్సీ.

"నేనిక్కడే వుంటాను-" అంది ష్యూ "ఆ మర్రాకుల పతనాన్ని నువ్వు ఇంతేసి కళ్లు చేసుకుని, విప్పార్చి చూడకుండా కళ్ళు మూసుకుని, కాస్సేపు నిద్రపోతే సంతోషిస్తాను"

"ఓకే అలా అయితే నీ పని పూర్తవగానే నాతో చెప్పు. ఎందుకంటే నేనా చివరాకు పతనాన్ని కళ్ళారా చూడాలి. నేనీ విధంగా కాచుకోవడంతోను, రకరకాల ఆలోచనలతోను -బాగా అలసిపోయాను. ఆ మర్రి ఆకుల్లా నేను కూడా -ఈ ఇహలోక బంధాల్ని త్యజించి -దూరంగా, ఎక్కడికో మరలిరాని లోకాలకి తరలిపోవాలి!

"దయచేసి నిద్రపో, కనీసం నిద్రించడానికి ప్రయత్నించు, నేస్తమా! నేను ఆ ముసలాయన 'బెహర్మన్' ను మోడల్ 'గా నా చిత్రానికి పిలవడానికి పోతున్నాను. నేను తిరిగి వచ్చేదాకా కదలకుండా అలానే వుండు-"



ముసలి బెహర్మన్ కూడా ఒక చిత్రకారుడే! అతను కింది అంతస్థులో వుంటున్నాడు. అతని వయస్సు ఆరు పదులపై మాటే! పెయింటింగ్ వేయడంలో అపజయం చెందానంటుంటాడు. అతనెప్పుడూ ఒక 'కళాఖండం' చిత్రించాలనుకుంటుండే వాడు; కాని, అది ఈ రోజు దాకా సాధ్యపడలేదు. చాలా రోజులుగా అతనెటువంటి చిత్రాలు వేయడంలేదు. ఆ కాలనీలో వున్న ఇతర పెయింటర్స్‌కు 'మోడల్'గా వుంటూ, తన జీవితాన్ని వచ్చినదాంతో సంతృప్తిగా గడిపేస్తున్నాడు.

ష్యూ అతనికి జాన్సీ కథంతా చెపింది. "చిత్రం! లోకంలో ఎక్కడైనా చెట్ల ఆకులు పోయుంటే వాటిలో తమ జీవితాన్ని సరిపోల్చుకునే వాళ్ళుంటారా? నేనైతే ఇప్పటి వరకు ఇటువంటి విషయం వినలేదు. నేన్నీకు మోడల్‌గా ఇక రాను; ఎందుకంటే - తనలా అవడానికి నువ్వే కారణం!" బెహర్మన్ అరిచాడు.

"ఆమె చాలా జబ్బుగా, నీరసంగా వుంది తాతా!" అంది ష్యూ.

"ఆ జ్వర తీవ్రత ఆమెనలా చిత్రంగా యోచించేలా చేస్తున్నదేమో! పోనీలే నువ్వు నాకిప్పుడు మోడల్‌గా రావద్దు. కనీసం కాస్త పైకొచ్చి ఆమెకు ధైర్యమన్నా చెప్పు!"

"పద నేనందుకు సిద్ధమే!" అన్నాడు బెహర్మన్.

"అసలీ ప్రాంతం మిస్ జాన్సీ లాంటి మంచమ్మాయిలు జబ్బు పడడానికి తగినది కాదు. కొద్దిరోజులు పోయాక నేనొక మాస్టర్ పీస్, చిత్రిస్తాను; తర్వాత మనమంతా మరొక మంచి ప్రాంతానికి వెళ్ళి పోదాం. సరేనా?

బెహర్మన్‌కు ష్యూ అన్నా, జాన్సీ అన్నా చాలా ఆపేక్ష, ఆత్మీయత, అభిమానం వున్నాయి. వాళ్ళని తన స్వంత మనవరాళ్ళలా భావిస్తాడాయన!

ష్యూ, బెహర్మన్ కలసి పై అంతస్థు చేరారు. అప్పటికి జాన్సీ నిద్రబోతోంది. ష్యూ వెంటనే కిటికీ తలుపు మూసి, బెహర్మన్‌ను వేరొక గదికి పంపేసింది. తర్వాత ఆమె కూడా ఆయనను అనుసరించింది. ఇద్దరూ కొంతసేపు మాట్లాడకుండా ఒకర్నొకరు చూస్తూ నిలబడ్డారు. బైట ఉధృతంగా -మంచుతో కూడిన చల్లటి వాన కురుస్తోంది. ష్యూ ఆయనతో కాస్సేపు మాట్లాడి, తన గదికి వెళ్ళిపోయింది.

ఆ మర్నాడు ఉదయాన్నే ఆమె లేచేసరికి జాన్సీ, మూసివున్న కిటికీ వంక చూస్తూ, కూర్చొనుండడం కనబడింది.

ఆమె లేవడం చూసి జాన్సీ అరచింది. "కిటికీ రెక్క తెరువు, నేను చూడాలి!"

ష్యూ కిటికీ తెరిచింది. ఆశ్చర్యం! గతరాత్రి కురిసిన అంత ఉధృతమైన వానకూ తట్టుకొని, నిలిచివున్నదా ఆకు ఆ మర్రిచెట్టు మీద! అదే ఆ చెట్టుకు మిగిలిన ఏకైక ఆఖరాకు!!

"అదే ఆఖరిది!" అన్నది జాన్సీ తప్పని సరిగా రాత్రి రాలిపోతుందనుకున్నాను. నేను గాలి ఉధృతం ఘోష విన్నాను. ఇవాళ తప్పకుండా అది రాలిపోతుంది. అదే సమయంలో నేను కూడా మరణిస్తాను!

"అలా అనకు, డియర్" అంది ష్యూ, "నువ్వు నీ గురించి కాక నా గురించి యోచించు! నేనేం చేయాలి?"

కాని, జాన్సీ ఏమీ సమాధానమివ్వలేదు. పగలు గడిచింది. చీకటి పడుతున్నా ఆ ఆఖరాకు గోడమీద చెట్టు కొమ్మ పైనుండడం వాళ్లు చూడగలుగుతున్నారు. తర్వాత, తిరిగి గత రాత్రిలా వర్షం ప్రారంభమైంది ఉధృతంగా! ష్యూ కిటికీ రెక్క బంధించింది.

మర్నాడు ఉదయాన్నే వెలుతురు రాగానే ష్యూని కిటికీ రెక్క తెరవమని కోరింది జాన్సీ. ష్యూ రెక్క తెరిచింది.

ఆ ఆఖరి మర్రాకు అలానే చెక్కు చెదరకుండా చెట్టు మీద నిలిచి వుంది!!

జాన్సీ కొంచెం సేపు దానికేసి చూస్తూ ఉండిపోయింది.తర్వాత ష్యూని పిలిచి ఇలా అంది "నేను చాలా చెడ్డదాన్ని, షుడీ! (ష్యూ ముద్దుపేరు!) ఏదో మానవాతీత శక్తి ఆ ఆఖరాకునలా చెట్టుకి నిలబెట్టి వుంచింది. నేనెంత చెడ్డదాన్నో తెలుసుకునేట్టు చేసింది. చావాలనుకోవడం చాలా పాపం. నాకు కొంచెం ఆహారం పాలూ పట్రా! అద్దం, దువ్వెనా కూడా! నేను దువ్వుకుంటూ నువ్వు చేసే వంట పని చూస్తాను!

మరో గంట తర్వాత ఆమె ఇలా అంది: "షుడీ! ఒక రోజున నేను 'బే ఆఫ్ నేపిల్స్' చిత్రించాలను కుంటున్నాను"

మధ్యాహ్నం జాన్సీని చెక్ చేశాడు డాక్టర్ .

"అవకాశాలు అంతంత మాత్రమైనా, నీ మంచి సహచర్యం వల్ల ప్రమాదం తప్పింది, ష్యూ! ఇకపోతే, నేను కింది అంతస్థులో మరోకేసు చూడాలి. అతని పేరు బెహర్మన్ అట! అతనూ మీ చిత్రకారుల వంశం వాడే! అతనికీ 'న్యుమోనియా' అనే నా నమ్మకం. అతనొక వయసు మళ్లిన, బలహీనమైన వ్యక్తి కావడం చేత, దాని ప్రభావం బాగా ఎక్కువగానే వుంటుంది అతనిమీద! అతనికి బతికి బట్టకట్టే అవకాశాలైతే దాదాపు పూజ్యం అని చెప్పొచ్చు. ఎందుకైనా మంచిదని బెటర్ ట్రీట్మెంట్ కోసం ఆసుపత్రికి పంపుతున్నామతగాడిని."

ఆ మర్నాడు డాక్టర్, ష్యూతో అన్నాడిలా "కంగ్రాచ్యులేషన్స్, షుడీ! నీ ఫ్రెండ్ పూర్తిగా ప్రమాదం నుండి తప్పించుకొంది. నువ్వు నీ ప్రయత్నంలో విజయం సాధించావు"

ఆ రోజు మధ్యాహ్నం ష్యూ, జాన్సీ పడుకున్న మంచం దగ్గర కొచ్చి, ప్రక్కనే కూలబడుతూ ఇలా అంది; "ఇప్పుడు నేను నీకొక విషాదగాథ చెప్పాలి, డియర్ జాన్సీ! మన బెహర్మన్ ఈ దినం ఆసుపత్రిలో న్యుమోనియాతో తనువు చాలించాడు. ఆ వ్యాధి వచ్చిన రోజు, అంటే నిన్న బెహర్మన్ అతని గదిలో బాధతో, సహాయం లేకుండా పడివుండడం ప్రక్క పోర్షను వాళ్ళు చూశారట! అతని జోళ్ళ దుస్తులూ తడితడిగా, మంచులా చల్లగా వున్నాయట! అంత భయంకర మైన వానరాత్రిలో అతనెటు వెళ్ళుంటాడో వాళ్ళెవరూ ఊహించలేక పోయారట. కాస్సేపటి తర్వాత అంతా అప్పటికే వెలుగుతున్న ఒక లాంతరూ, ఒక నిచ్చెనా, కొన్ని ఛిన్నాభిన్నమైన కుంచెలూ, ఆకు పచ్చరంగూ, పసుపు రంగూ కలిసిన మిశ్రమం -అక్కడ చూశారట! ఆ కిటికీ కవతలి వైపు చూడు. డియర్! ఆ గోడ మీద గల ఆఖరాకు వైపు చూడు! అంతగాలి వీచినా వర్షం కురిసినా -అది ఎప్పటికీ రాలకపోవడం, కదలకపోవడం నీకాశ్చర్యం కల్గించలేదా? ఓ డార్లింగ్! అది ముసలి బెహర్మన్ యొక్క మాస్టర్ పీస్! ఆ చెట్టు చివరాకు రాలిపోయిన నాటి రాత్రి, అతను కృత్రిమమైన దాన్నలా చిత్రించి, అక్కడుంచాడు! గాలిలో కలసి పోబోతున్న నీ ప్రాణాన్ని న్యుమోనియాతో వణుకుతూ, తుమ్ముతూ, దగ్గుతూ, ఉక్కిరి బిక్కిరవుతూ, ఆ కాలరాత్రిలో కనిపించని సుదూర లోకాలకు తిరిగిరాని ప్రయాణం కట్టాడు". ★

సాహితీప్రియులకు విందుభోజనం



కేతు విశ్వనాథ రెడ్డి గారికి కడపతో ఉన్న అనుబంధం చాలా ఆత్మీయమైనది - అపురూపమైనది కూడా! 1962లో కడప కాలేజీలో ట్యూటర్‌గా చేరినప్పటి నుండి ఏడు సంవత్సరాల పాటు అక్కడి సాహితీ మిత్రులతో, చర్చలతో, సాహిత్యంతో ముడివేసుకుపోయింది. వారు జీవితాన్ని జర్నలిజంతో ప్రారంభించి లెక్చరర్ - రీడర్ - ప్రొఫెసర్ - డీన్ డైరెక్టర్‌గా మజిలీలు సాగించి భూమి గుండ్రంగా ఉందన్నట్లు మళ్లీ జర్నలిజంలో స్థిరపడిపోయారు. తెలుగు పాఠకులకు ఆయన కథకుడిగా, నవలా రచయితగా పరిచయస్తులు. తెలుగు విద్యావేత్తగా, పాఠ్యపుస్తకాల రూపకర్తగా, భాషావేత్తగా సాహితీ వేత్తలకు చిరపరిచితులు. సగటు మనిషికి ఆయన పరిచయం 'జర్నలిస్టు'గానే! 'సంగమం' - 191 పేజీల్లో వారి వ్యాసాలు - ప్రసంగాలూ - ఆపేక్షలూ - దృక్పథంతో నిండి ఉన్న సాహిత్యపు విందు భోజనం. ఒకవైపు 'గ్రాంథిక వ్యవహారిక భాషోద్యమం'లోని 'భాషావాదం'.... అన్యదేశాల అనువాద సమస్యల్లోని 'చ్ఛపున్' - 'వకాలత్ నామా' - 'భసాయించు' లాంటి మాండలికాల పద ప్రయోగాల ముచ్చట్లు.... 'తెలుగు పత్రికలలోని భాషా ప్రమాణీకరణాల' చర్చలూ.... 'రాయలసీమ ప్రాంతంలోని -సేద్యానికి ఎన్ని వసద్దలుండాల....' వంటి మాండలికాల సొంపులూ.... మరోవైపు 'సంగమం' అంకితం చేసిన 'బూరాకు' (బూదరాధాకృష్ణ) 'చేరాకు' (చేకూరి రామారావు) లతో ఆత్మీయతను వర్ణించే అక్షర గీతికలు.. సాహితీ ప్రియులకు 'ఆత్మ చరిత్రలా మనసు విప్పుకునే రాతలు!! కట్టుకథలో, కవి కట్టిన కథలో అల్లిన కథలో కాని 'ఊరూరి కథల ముచ్చట' 'పెన్నక్క చెరువు' 'వంటడు, మిట్టడు వెరసి బంటిమిట్ట' లాంటి స్థల పురాణం గాథలూ... ఆఖర్న 14 పేజీల నిండా వ్యాపించిన వ్యక్తిత్వం ప్రశ్నలూ- జవాబుల' రూపంలో పలకరిస్తాయి. తెలుగు భాషా సాహితీ బోధనలో విప్లవాత్మక ఒరవడి సృష్టికర్త 'కేతు విశ్వనాథ రెడ్డి'గారి 'సంగమం' సాహితీ ప్రియులకు ఆత్మీయమైన విందు భోజనం! చదివి, రుచులను ఆస్వాదించాలి!!

కొత్త పుస్తకాలు

సంగమం (వ్యాసాలు, ప్రసంగాలు)

రచన : కేతు విశ్వనాథ రెడ్డి

వెల:80/-, పేజీలు: 191,

ప్రతులకు : విశాలాంధ్ర/ నవోదయ/ ప్రజాశక్తి - హైదరాబాద్

జయంతి - విజయవాడ/ నందలూరు కథానిలయం - నందలూరు.

- జె.పి. వైద్య

ఎం.డి గారి భార్య

వివాహం ఒక మహాసముద్రం... అయితే దిశలు తెలిపే 'దిక్సూచి' ని దంపతులే ఎన్నుకోవాలి. అదృష్టవంతులకు జీవితమనే తుఫానులో అది ఒక హార్బరు లాంటిది. దురదృష్టం వెంటాడితే మటుకు వివాహ వ్యవస్థ నౌకాశ్రయంలో 'తుఫాన్'లా మారి జీవితాలను కకావికలం చేసి పారేస్తుంది. సుధామూర్తి గారు, నారాయణమూర్తి గారు, ఇన్ఫోసిస్... ఇవన్నీ పేపరు తిరగేసే సగటు మనిషికి పరిచయస్తులే. రెండు దశకాల క్రితం సుధామూర్తి కన్నడంలో రాసుకున్న తొలి నవల... 'ఎమ్.డి గారి భార్య'. తెలుగులో అనువాదం చేసింది 'ద్వారకా'. అనువాదం అక్కడక్కడ అనువాదంలాగే భావించవచ్చు పాఠకులు. నవలలోని ఇతివృత్తం ప్రస్తుత పరిస్థితుల్లో 'సింగిల్ న్యూక్లియర్ ఫ్యామిలీ' పద్ధతుల్లో సాగే జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. భార్యా భర్తలు 'జీవిత బండికి రెండు చక్రాలు' అని మనం చాలా సార్లు, ఎన్నో చోట్ల చదివే ఉన్నాము. త్రోవ బాగున్నా 'చక్రాల తిప్పలు' ఎలాంటివో కూడా తెలుసు. 'ఇగో క్రాషెస్' అన్నారు వాటిని. 'ఎమ్.డి గారి భార్య' అన్న టైటిల్‌కు తగ్గట్టు స్త్రీవాద నవల. ఇరుగు పొరుగు అబ్బాయిలు, అమ్మాయిలు 'తొలి చూపులోనే ప్రేమ' లాంటి వ్యవహారం కాకున్నా ప్రేమించుకుంటారు. పెళ్లి చేసుకుంటారు. దురదృష్టం కొద్దీ భార్య భర్తను వదిలేసి వెళ్లిపోతుంది. కార్పొరేట్ వాణిజ్య రంగంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఇవే. అయితే ఇంత చదువూ, అంతకన్నా ఎక్కువ సంస్కారం ఉన్న రెండు మనస్సులు కాస్తంత ఓపికతో పరిస్థితులను చక్కబెట్టుకోలేక పోయారెందుకూ? అనే ప్రశ్న మనస్సులో రెపరెపలాడి పాఠకులను 'బేచైన్' చేస్తుంది. లక్షల కోట్ల రూపాయల కార్పొరేట్ రంగం లోని పెద్ద మనుషులకు అంత కన్నా విలువైన జీవితాన్ని అంతటి 'అబ్రప్టనెస్'తో తెంచేసుకోవడం అంత సుళువుగా జీర్ణం కాదు. పాఠకులూ, సమాజం 'జీర్ణప్రక్రియ' కోసం తగు మందుల గురించి ఆలోచించక తప్పదు అని అన్పిస్తుంది నవల ఆఖరు పంక్తులు చదివాక.

ఎం.డి గారి భార్య (నవల)

రచన: సుధామూర్తి

వెల: 90/-,

పేజీలు : 163,

ప్రతులకు : అశోక్ బుక్ సెంటర్ - విశాఖపట్నం

అక్షర - హైదరాబాద్.

- జె.పి. వైద్య



చిన్ని 'తండ్రి'

మనం పోతోంది ముందుకో వెనక్కో అర్థంకాదు ఒక్కో సంఘటన చూస్తుంటే. ఇదిగో ఇక్కడ కనిపిస్తున్న పిల్లవాడికి పదమూడేళ్లు. ఇంకా పసితనపు ఛాయలు కూడా పోలేదు. నిజం చెప్పాలంటే వాడే ఎనిమిదేళ్ల పిల్లాడిలా వున్నాడు. తమాషా ఏంటంటే... చేతిలో వున్న పాపకు తనే తండ్రి. తన బిడ్డ, బిడ్డ తల్లితో సహా ఇదిగో ఇలా ఫోజిచ్చిన ఈ పిడుగు బ్రిటన్ వాసి. నమ్మశక్యంగా లేకున్నా నిజమే మరి.

బీరు బాటిళ్లతో ఆలయం



ఈ కట్టడాన్ని వేటితో కట్టారనుకుంటున్నారు! తెలీదా?! పోనీ ఖాళీ బీరుబాటిళ్లతో నిర్మించారంటే నమ్ముతారా? ఏంటలా అడ్డంగా తలాడిస్తున్నారు! అయితే మీరు థాయ్‌లాండ్ వెళ్లిచూడాల్సిందే. అక్కడ ఓ ఆలయాన్ని పదిలక్షల బీరుబాటిళ్లను ఉపయోగించి కొత్త తరహాలో ఇలా కట్టేశారు.



కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీ క్కూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫోటో ను అతికించి పోస్ట్ చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి.

వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్

కలంస్నేహం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1,
అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్.

పేరు: గొట్టం మాధవి
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: చదవడం
చిరునామా: గొట్టం మాధవి
డాటరాఫ్ :గొట్టం కనకయ్య
మిరుదొడ్డి (గ్రామం),
మెదక్.

పేరు: వి. నరేష్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం
లక్ష్యం: క్రికెటర్ కావడం
హాబీలు: ఆటలు ఆడటం
చిరునామా: వి.నరేష్
సన్నాఫ్ వి.కుమార్
ధర్మారం(గ్రా), మిరుదొడ్డి (మం),
మెదక్.

పేరు: కె. చంద్రశేఖర్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవటం, బొమ్మలు వేయటం
చిరునామా: కె. చంద్రశేఖర్
సన్నాఫ్ :కె.రాజయ్య
చెప్యాల , మిరుదొడ్డి.
మెదక్.

పేరు: ఎమ్.కవిత
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం
లక్ష్యం: ఇంజనీర్ కావటం
హాబీలు: చదవటం
చిరునామా: ఎమ్.కవిత
విజ్ఞాన భారతి విద్యాలయం
మిరుదొడ్డి (మం),
మెదక్.

పేరు: కె. రజిత
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం
లక్ష్యం :డాక్టర్ కావడం
హాబీలు: చదవటం
చిరునామా: కె. రజిత
డాటరాఫ్ :క్రిష్ణయ్య
మిరుదొడ్డి
మెదక్.

పేరు: టి. రాజశేఖర్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాస భారతి విద్యాలయం
లక్ష్యం: సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావడం
హాబీలు: పాటలు పాడటం
చిరునామా: టి. రాజశేఖర్
సన్నాఫ్ : రామచంద్రం
చీకోడ్,దుబ్బాక (మ),
మెదక్.

పేరు: ఇ.కుమార్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం,
లక్ష్యం : పోలీస్ ఆఫీసర్ కావడం
హాబీలు: చదవటం, ఆడటం
చిరునామా: ఇ.కుమార్
సన్నాఫ్ : మల్లయ్య
లక్ష్మీనగరం
మిరుదొడ్డి (మ), మెదక్.

పేరు: బి. కవిత
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం
లక్ష్యం : టీచర్ కావడం
హాబీలు: టీవీ చూడటం
చిరునామా: బి. కవిత
డాటరాఫ్ : బి. అంజయ్య
ఇం.నెం:7-5-115/ఎ
ఎన్టీఆర్ నిలయం. ఎన్టీఆర్ నగర్
పానగల్లు, నల్లగొండ.